ప్రజాశక్తి

ఆదివారం 24 ఆగస్టు 2025 | 8 పేజీలు



ఎన్‌టిఆర్




కృష్ణా

ప్రచారం కొండంత... సాయం గోరంత...



ముప్పాళ్ళలో బంగారు కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు

● సిఎం పర్యటించిన ముప్పాళ్లలోనే మార్గదర్శుల కొరత ● కలెక్టర్ వెళ్లినా అందరికీ అందని సాయం



ప్రజాశక్తి- నందిగామ : టిడిపి కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పి4 బంగారు కుటుంబాలకు సాయం పథకంపై ప్రచారం కొండంత, మార్గదర్శకుల సాయం గోరంత అన్నట్లు ఉంది పరిస్థితి. క్షేత్ర స్థాయిలో బంగారు కుటుంబాలకు సాయం అందజేయటానికి మార్గదర్శకులు పెద్దగా ముందుకు రావడం లేదు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఏప్రిల్ 5వ తేదీన బాబు జగ్జీవన్‌రామ్ జయంతి సందర్భంగా ఎన్‌టిఆర్ జిల్లా నందిగామ నియోజకవర్గం చందర్లపాడు మండలం ముప్పాళ్ళ గ్రామంలో పర్యటించారు. బంగారు కుటుంబాలకు ఎంపికైన రెండు కుంటుబాల వారిని కలిసి మాట్లాడారు. మార్గదర్శకుల ద్వారా ఒక కుటుంబానికి ఆటో, మరో కుటుంబానికి గేదె, మూడు సెంట్ల చొప్పున స్థలాలను పంపిణీ చేశారు. మరో రెండు కుటుంబాలకు కుట్టు మిషన్లు అందించారు. మరో ఇద్దరు బంగారు కుటుంబాలకు ఉద్యోగం ఇచ్చారు. మార్గదర్శులుగా ముందుకు వచ్చిన క్రక్స్ బయోటెక్ కంపెనీ, సెంటిని కంపెనీ, అంబా కోచ్ బస్ బిల్డర్స్ కంపెనీ తదితర కంపెనీల వారిని సిఎం చంద్రబాబు సన్మానించారు. అయితే ఆ తర్వాత క్షేత్ర స్థాయిలో ఆ బంగారు

(మిగతా 2లో)

బంగారు కుటుంబాలు - 2



పేదరికంతో ఉన్నాం.. ఆదుకోండి చింతపల్లి మౌనిక, ఎస్‌సి కాలనీ, ముప్పాళ్ళ

సొంత ఇల్లు లేదు. రేకుల షెడ్లో అద్దెకుంటున్నాను. బంగారు కుటుంబ సభ్యులుగా ఎంపిక చేశారు. కుట్టు మిషన్ కావాలని అడిగాను. ఇంతవరకు ఇవ్వ లేదు. ఆదుకోవాలని కోరుతున్నాను.



ఆటో కావాలని అడిగా : వల్లభదాసు రాజశేఖర్

భార్య చనిపోయింది. స్థలం లేదు. ఆటో కావాలని అడిగా. మార్గదర్శులు అందుకు ముందుకు రాలేదు.



గొర్రెల కోసం రుణాలు ఇవ్వాలి : కొండ్రు స్వామి

నాకు ఎటువంటి ప్రభుత్వం సాయం అందలేదు. బంగారు కుటుంబ సభ్యుడుగా గొర్రెల కోసం రుణాలు ఇవ్వాలి. కుమారుడికి ఉద్యోగం ఇవ్వాలి.



కుమార్తెకు ఉద్యోగం కావాలి : పంది వెంకటేశ్వర్లు

నా కుమార్తె బిఎస్‌సి, టిటిసి చదివింది. వివాహం చేయలేదు. మార్గదర్శులు ఉద్యోగం ఇప్పించాలని కోరుతున్నా.



బిటెక్ చదివినా ఉద్యోగం లేదు : కోట నాగలక్ష్మి

బిటెక్ చదువుకున్నాను. ఇంకా ఉద్యోగం రాలేదు. సొంత స్థలం కూడా లేదు. ఉద్యోగం కావాలని అడుతున్నా.



రాజకీయాలకతీతంగా ఆదుకోవాలి : కోట అశోక్

బంగారు కుటుంబ సభ్యులను రాజకీయాలకతీతంగా ఆదుకోవాలి. ఒక గ్రామంలో 42 మందిని ఎంపిక చేశారు. అలాగే సర్వే పేరుతో మరో 250 మందిని ఎంపిక చేశారు. వారిని ప్రభుత్వం ఆదుకోవాలి.

స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

మంత్రి కొల్లు రవీంద్ర



మచిలీపట్నం మండలం పోతేపల్లిలోని మురికికాల్వల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ బాలాజీ తదితరులు

ప్రజాశక్తి - మచిలీపట్నం రూరల్ : స్వచ్ఛత సాధన ద్వారా స్వర్ణాంధ్ర సాధించవచ్చని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నం మండలం పోతేపల్లి గ్రామంలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా వర్షాకాలంలో పరిశుభ్రత అనే ఇతివత్తంతో అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి కొల్లు రవీంద్ర, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తదితరులు పాల్గొని గ్రామంలోని మురికికాల్వల్లో దోమల నివారణకు ఆయిల్ బాల్స్ వేశారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, శ్రీ ఆంజనేయస్వామి గుడి సమీపంలో ఏర్పాటుచేసిన సభా కార్యక్రమాల్లో ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం మంత్రి కొల్లు మాట్లాడుతూ ప్రభుత్వం పెద్దఎత్తున మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టిందన్నారు. తద్వారా ఉష్ణోగ్రతలు తగ్గుతాయన్నారు. నగరంలోని జాతీయ కళాశాల సమీపంలో ఉన్న డంపింగ్ యార్డ్‌తో విపరీతమైన దుర్గంధం వస్తు చాలా మంది ప్రజలు అనారోగ్యం పాలయ్యారన్నారు. తమ ప్రభుత్వం వచ్చాక ఆ డంపింగ్ యార్డ్‌లో ఇప్పటివరకు దాదాపు 75 శాతం శుభ్రం చేసిందని అన్నారు. ఇంకా 25 శాతం వచ్చే అక్టోబర్ గాంధీ జయంతి నాటికి శుభ్రం చేసి అక్కడ పార్కును అభివద్ధి చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో మూసివేసిన చెత్త నుండి సంపద తయారీ కేంద్రాలను పునరుద్ధరిస్తామన్నారు. నగరపాలక సంస్థకు రూ.2 కోట్ల వ్యయంతో రెండు

(మిగతా 2లో)

నేడు చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం

విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం, ఫోరం ఫర్ ఆర్టిస్ట్స్, కళాయజ్ఞ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో చిత్రకారుల రాష్ట్ర సమ్మేళనం జరుగుతుంది. దీనిలో భాగంగా 'శ్రమైక జీవనం' చిత్ర ప్రదర్శన, 'వర్తమాన పరిస్థితుల్లో చిత్రకారుని పాత్ర' అంశంపై సదస్సు ఏర్పాటు చేయనున్నారు. రాష్ట్రంలో ప్రముఖ చిత్రకారులు 48 మంది 'శ్రమైక జీవనం'పై వేసిన చిత్రాలతో కూడిన ఎగ్జిబిషన్‌ను చిత్రకళావధాన్ మార్లపూడి ఉదయ్‌కుమార్ ప్రారంభిస్తారు. అనంతరం జరిగే సదస్సులో ప్రఖ్యాత కార్టూనిస్ట్ శ్రీధర్, యోగి వేమన విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్‌కు చెందిన డాక్టర్ మత్యుంజయరావు, సాంప్రదాయ చిత్రకళ అధ్యాపకులు డాక్టర్ సాగర్ గిన్నె, ప్రముఖ చిత్రకారులు వై.శేషబ్రహ్మం, తెలుగు బాషోద్యమ సంస్థ నాయకులు ప్రొఫెసర్ గారపాటి ఉమామహేశ్వరావు పాల్గొంటారు.

నేడు జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు

విజయవాడ : ప్రజా ఆరోగ్య వేదిక (జన స్వాస్థ్య అభియాన్) ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ ఉదయం 10 గంటలకు రాఘవయ్యపార్క్ సమీపంలోని ఎంబి విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో 'వైద్య రంగం ప్రైవేటీకరణ – ప్రభావాలు – పరిష్కారాలు" అన్న అంశంపై జాతీయ స్థాయి ఆరోగ్య సదస్సు జరుగుతుంది. "పెరుగుతున్న కేన్సర్ వ్యాధులు – నివారణ, జాగ్రత్తలు', ఆరోగ్య సంరక్షణ వ్యవస్థల పరిరక్షణ ఆవశ్యకత' అన్న అంశాలపై ప్రముఖ వైద్యులు, హెల్త్ కేర్ సిస్టమ్ బలోపేతానికి కృషి చేసిన డాక్టర్ జి.వి.ఎస్.మూర్తి, ప్రముఖ కేన్సర్ వ్యాధి నిపుణులు, నిమ్స్, టాటా మెమోరియల్ హాస్పిటల్ డైరెక్టర్‌గా పనిచేసిన డాక్టర్ డి.రఘునాధరావు, ప్రముఖ గైనకాలజిక్ ఆంకాలజిస్ట్ డాక్టర్ డి.లీల మాట్లాడతారు. ఈసందర్భంగా కేన్సర్ వ్యాధి – నివారణ – జాగ్రత్తలపై బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తారు.

కృష్ణా వరద తగ్గుముఖం

వార్త 2లో

బుడమేరు ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం

- సిపిఎం రాష్ట్ర నేతలు బాబురావు, కాశీనాథ్
- హెడ్ రెగ్యులేటర్, డైవర్షన్ ఛానల్ పరిశీలన



బుడమేరు హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న సిపిఎం నేతలు సిహెచ్.బాబురావు, డి.కాశీనాథ్, పి.వి.ఆంజనేయులు

ప్రజాశక్తి - జి.కొండూరు : బుడమేరు ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబురావు, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ విమర్శించారు. బుడమేరు డైవర్షన్ ఛానల్ ఇప్పటికీ విస్తరణకు నోచుకోలేదన్నారు. వెలగలేరు రెగ్యులేటర్ నిర్వహణ పనులు నత్త నడకన సాగుతున్నాయని పేర్కొన్నారు. ముంపు నివారణ శాశ్వత చర్యలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేయడంలేదన్నారు. సిహెచ్.బాబురావు, డి.కాశీనాథ్‌తోపాటు పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు శనివారం జి.కొండూరు మండలం వెలగలేరు వద్ద ఉన్న బుడమేరు హెడ్ రెగ్యులేటర్, డైవర్షన్ ఛానల్ తదితర ప్రాంతాలను సందర్శించారు. భారీ వర్షాలు కురిసి మరోసారి బుడమేరు ముంపు ప్రమాదంతో ప్రజలు ఆందోళన చెందుతున్న నేపథ్యంలో నిర్వహణ పనులను నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా బాబురావు, కాశీనాథ్ మాట్లాడుతూ ఆగస్టు నెలాఖరు వచ్చినా ఇంకా నిర్వహణ పనులు పూర్తి కాలేదన్నారు. పెయింటింగ్ ఇతర పనులు ఇంకా సాగుతూనే ఉన్నాయన్నారు. గత సంవత్సరం వరదలతో గండిపడిన ప్రాంతంలో రిటైనింగ్ వాల్ నిర్మాణం చేపట్టినా, ఇంకా పనులు జరుగుతూనే ఉన్నాయని వివరించారు. తాత్కాలిక పనులే తప్ప శాశ్వత నివారణ చర్యలు చేపట్టలేదన్నారు. విజయవాడ నగరంతోపాటు

(మిగతా 2లో)

సురవరం స్ఫూర్తితో ముందుకు సాగాలి

సంతాప సభలో అక్కినేని వనజ



విజయవాడ : సిపిఐ అగ్రనేత సురవరం సుధాకర్ రెడ్డి ఆకస్మిక మరణం పార్టీకి తీరని లోటని ఆ పార్టీ జాతీయ నాయకురాలు అక్కినేని వనజ అన్నారు. అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మరణించిన సురవరం సంతాపసభ పార్టీ రాష్ట్ర కార్యాలయం దాసరి భవనంలో శనివారం జరిగింది. తొలుత సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అక్కినేని వనజ మాట్లాడుతూ సురవరం తెలంగాణ సాయుధ పోరాట ఉద్యమ స్ఫూర్తితో విద్యార్థి ,యువజన సమాఖ్యలలో రాష్ట్ర, జాతీయ స్థాయి బాధ్యతలు నిర్వహించడమే కాకుండా పార్టీ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారని గుర్తుచేశారు. సిపిఐ ఎన్టీయార్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఎపి మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెన్మెత్స దుర్గాభవాని మాట్లాడుతూ కమ్యూనిస్టు ఉద్యమానికి సుధాకర రెడ్డి చేసిన సేవలు అజరామరమని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు మోతుకూరి వెంకటేశ్వరరావు, నగర సహాయ కార్యదర్శి నక్క వీరభద్రరావు, నగర నాయకులు బుట్టి రాయప్ప, మోతుకూరి అరుణకుమార్ తదితరులు పాల్గొన్నారు.



వరద తగ్గుముఖం

బ్యారేజి వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక ఎత్తివేత

ఇన్ ఫ్లో, అవుట్ ఫ్లో 3.92 లక్షల క్యూసెక్కులు

ప్రజాశక్తి- విజయవాడ సిటీ : కృష్ణా నదికి క్రమేణా వరద ప్రవాహం తగ్గుతోంది. ప్రకాశం బ్యారేజీకి 3,92,920 క్యూసెక్కుల వరద నీరు చేరుతోంది. కష్ణా తూర్పు, పశ్చిమ ప్రధాన కాల్వలకు 17,795 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. 3,75,125 క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి విడుదల చేశారు. వరద ప్రవాహం తగ్గిన నేపథ్యంలో బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికను ఇరిగేషన్ అధికారులు ఎత్తివేశారు. ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, అవుట్లో 3.92 లక్షల క్యూసెక్కులుగా ఉంది.

అన్ని పోలీసుస్టేషన్లలో స్వచ్ఛాంధ్ర

విజయవాడ : స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పోలీస్ స్టేషన్, పరిసర ప్రాంతాలను శనివారం ఎన్టీఆర్ జిల్లా పోలీసులు శుభ్రపరిచారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో వర్షాకాలంలో వరదలు, అంటువ్యాధుల నివారణ చర్యలు చేపట్టారు. నగర పోలీస్ కమీషనర్ ఎస్.వి.రాజ శేఖర బాబు ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్లలో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించాలని ఇచ్చిన ఆదేశాల మేరకు అన్ని పోలీస్ స్టేషన్లోను, ఏ.సి.పి. ఆఫీసుల్లోనూ, డి.సి.పి.ఆఫీసుల్లో, ఎస్.బి. సి.సి.ఆర్.బి. ఆఫీసుల్లోనూ, పనికిరాని సామాన్లను తీసివేసి శుభ్రపరిచినారు. తక్కువ లోతు, లోతుగా ఉన్న వర్షపు నీటి డ్రైనేజీ కాలువలను శుభ్రపరచడం, దోమలు గుడ్లు పెట్టే నీటి నిల్వలను తొలగించి పోలీసు స్టేషన్ పరిసార ప్రాంతాలు శుభ్ర పరచడం వల్ల ఎలాంటి అనారోగ్య సమస్యలు తలెత్తకుండా ఉంటాయని ముఖ్య ఉద్దేశంతో అధికారులు, సిబ్బంది తమ తమ పోలీస్ స్టేషన్లలో, కార్యాలయాలలో పరిశుభ్రతను పాటించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్య పరిరక్షణ, వత్తి పట్ల క్రమశిక్షణ కలిగి ఉండాలని ఆకాంక్షించారు.


పోలీసుస్టేషన్ ఆవరణను శుభ్రం చేస్తున్న పోలీసులు

మొదటిపేజీ తరువాయి

ప్రచారం కొండంత... సాయం గోరంత...

కుటుంబాలకు మార్గదర్శకుల సాయం నామమాత్రంగానే అందుతోంది. అలాగే ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ ముప్పాళ్ళ గ్రామంలో ఐదు రోజుల పర్యటించి పి4 కింద 42 బంగారు కుటుంబాలకు ఎంపిక చేశారు. వీరిలో నలుగురైదుగురికి మినహా మిగిలిన వారికి నేటికీ సాయం అందలేదు. గ్రామ దళితవాడ బంగారు కుటుంబాలకు కూడా సాయం అందడంలేదు. మరోవైపు మార్గదర్శుల ద్వారా ఆటోలు పొందిన కుటుంబాల వారే నెలవారీ ఫైనాన్స్ (ఇఎంఐ)ను కట్టుకుంటున్నారు. అలాగే బంగారు కుటుంబం పథకానికి ఎంపికైనా కోట మరియమ్మ, భర్త హరినాథ్ పనులు లేకపోవటంతో కీసర గ్రామానికి వలస పోయారు. గ్రామంలో పలువురు బంగారు కుటుంబాలకు ఇళ్లు లేవు, స్థలాలూ లేవు. అద్దె ఇళ్లలోనే నివాసం ఉంటున్నారు. పలువురు జీవనోపాధి కోసం ఎదురు చూస్తున్నారు. ఓ బంగారు కుటుంబం పొక్లయినర్ అడగటంతో మార్గదర్శులు చేతులెత్తేసినట్లు తెలిసింది.


ముప్పాళ్ళలో బంగారు కుటుంబానికి ఇచ్చిన ఆటో


ముప్పాళ్లలో పని కోసం వలస పోయిన బంగారు కుటుంబం ఇల్లు

మొక్కుబడిగా మార్గదర్శుల సాయం

బంగారు కుటుంబాలకు మార్గదర్శకుల సాయం నామమాత్రంగా కూడా అందటం లేదు. ఈ పథకంపై మార్గదర్శులు పెద్దగా ఆసక్తి చూపడంలేదు. నందిగామ నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో బంగారు కుటుంబాల సర్వే 75 నుండి 100 శాతం వరకు సచివాలయం సిబ్బంది పూర్తి చేశారు. అయితే ఆయా గ్రామాల్లో కూటమి నాయకులు చెప్పిన వారందరినీ బంగారు కుటుంబాలకు సచివాలయం సిబ్బంది ఎంపిక చేస్తుండటంతో ఎవరిని ఆదుకోవాలో తెలియక మార్గదర్శులు ముందుకు రావటం లేదు. నందిగామ మండలానికి సంబంధించి ప్రతి గ్రామంలో 100 నుండి 450 మంది వరకు బంగారు కుటుంబాలను ఎంపిక చేశారు. వీరిని ఆదుకోవడానికి మార్గదర్శులెవరూ ముందుకు రాకపోవటంతో టిడిపి గ్రామ నాయకులే మార్గదర్శులుగా ఉంటున్నట్లు తెలిసింది. అయినా తమకు ఇంతవరకు ఎటువంటి సాయమూ మార్గదర్శుల నుండి అందలేదని పలువురు బంగారు కుటుంబాల వారు ఆవేదన వ్యక్తం చేశారు.


వర్షాలకు కురుస్తున్న బంగారు కుటుంబం రేకుల షెడ్డు

బుడమేరు ముంపు నివారణ చర్యల్లో ప్రభుత్వం విఫలం

ఎన్టీఆర్, కష్ణాజిల్లాల ప్రజలను వరద ముంచెత్తి సంవత్సరం గడిచినా, శాశ్వత చర్యలు చేపట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కొండపల్లి శాంతినగర్ ప్రాంతంలో కరకట్ట గండి పూడ్చటానికి రూ.30 కోట్లతో చేపట్టిన పనులు నెమ్మదిగా సాగుతున్నాయని పేర్కొన్నారు. గండ్లు పూడ్చటమే తమ ఘనతగా పాలకులు చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. డైవర్షన్ ఛానల్ లోతు, వెడల్పు, సామర్థ్యం పెంచే పనులను చేపట్టలేదని విమర్శించారు. వెలగలేరు రెగ్యులేటర్ వద్ద అదనపు సామర్థ్యం, అదనపు నీరు నిల్వ ఉంచే చర్యలు తీసుకోలేదని చెప్పారు. వర్షాకాలం ముందు నిర్వహణ పనులు చేపట్టలేదని, దీంతో ఆగస్టు ముగుస్తున్నా, ఇంకా నిర్వహణ పనులు సాగుతూనే ఉన్నాయని చెప్పారు. గత సంవత్సరం వరద సందర్భంలో హడావిడి చేసిన పాలకులు, ఆ తర్వాత ముంపు నివారణ శాశ్వత చర్యలకు అవసరమైన నిధులు విడుదల చేయటంలో పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. జిల్లాలోని ప్రజా ప్రతినిధులు బుడమేరు ముంపు నివారణ చర్యల విషయంలో నిర్లక్ష్య వైఖరి ప్రదర్శిస్తున్నారని అన్నారు. చిన్నపాటి వర్షాలతోనే ప్రజలు మళ్లీ వరద భయంతో భయాందోళనకు గురవుతున్నారని చెప్పారు. ప్రజలకు విశ్వాసం కలిగించడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కళు తెరచి శాశ్వత నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందుకు అవసరమైన నిధులు విడుదల చేయాలని, సమగ్ర ప్రణాళిక రూపొందించి వరద ముంపు నుండి ప్రజలను కాపాడాలని అన్నారు.

స్వచ్ఛతతోనే స్వర్ణాంధ్ర సాధ్యం

కాంప్యాక్టర్లను కొనుగోలు చేశామని, వాటితో రోజుకు 90 టన్నుల చెత్తను తొలగించే అవకాశం ఉందని తెలిపారు. ప్రస్తుతం ఒక్కో బండిలో 30 టన్నుల చెత్తను గుంటూరు, విజయవాడ పవర్ ప్లాంట్లకు తరలిస్తున్నామన్నారు. కష్ణా విశ్వవిద్యాలయం సమీపంలో 13 ఎకరాల స్థలాన్ని గుర్తించి పవర్ ప్లాంట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామన్నారు. ప్రభుత్వం చేపడుతున్న స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు రైల్వేట్రాక్ వద్ద మురుగునీటి సమస్య ఉందని, దానిని పరిష్కరించాలని మంత్రి దష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి స్పందిస్తూ ఈ విషయమై రైల్వే డిఆర్ఎంతో కూడా మాట్లాడి పరిష్కార దిశగా ప్రయత్నిస్తున్నామని, ఇందుకోసం రూ.3 కోట్లతో అంచనాలు రూపొందించామని, త్వరలో కార్యరూపం దాలుస్తుందని అన్నారు. పాఠశాలకు కావాల్సిన స్థలాన్ని కేటాయించేందుకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ మాట్లాడుతూ వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వంటి జ్వరాల బారిన పడకుండా ప్రజలందరూ జాగ్రత్త వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపిఓ జె.అరుణ, జడ్పి సిఈఓ కె.కన్నమ నాయుడు, మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, తహశీల్దారు నాగభూషణం, ఎంపీడీవో వెంకటేశ, డిఎల్‌పిఓ రహమతుల్లా, ఎంఈఓ దుర్గాప్రసాద్, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మాజీ ఎంపీపీ కాగిత వెంకటేశ్వరరావు, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు విద్యాసాగర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు మురళీకష్ణ, వివోఏ రామలక్ష్మి పాల్గొన్నారు.

టంగుటూరికి డిసిపి నివాళి

విజయవాడ : ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశంపంతులు జయంతి సందర్భంగా అడ్మిన్ డి.సి.పి. కె.జి.వి.సరిత ఆయన చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. నగర పోలీస్ కమిషనర్ కార్యాలయంలో ఆమె టంగుటూరి ప్రకాశం పంతులు చిత్ర పటానికి పూలమాల వేసి, పుష్పాలు సమర్పించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా సరిత మాట్లాడుతూ... స్వాతంత్ర్య సమర యోధునిగా, న్యాయవాదిగా, రాజకీయవేత్తగా, రచయితగా, సంపాదకీయునిగా, రాజనీతిజ్ఞునిగా రాణించిన విశేష ప్రతిభాశాలి అని కొనియాడారు.

యూరియా కొరత సృష్టిస్తే కఠిన చర్యలు : కలెక్టర్



ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : జిల్లాలో యూరియాను మళ్లింపు చేస్తూ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుం టామని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ హెచ్చరించారు. జిల్లాలో యూరియా మళ్లింపు నివారణ కు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం ఆయన కలెక్టరేట్లోని తన చాంబర్ నుంచి జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ, జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసిల్దార్లు, వ్యవసాయ, మత్స్య, పరిశ్రమలు, మార్క్ఫెడ్, ప్రొహిబిషన్ ఎక్సైజ్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లా డారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గత సంవత్సరం కంటే ఈ సీజన్లో దాదాపు 17 వేల మెట్రిక్ టన్నుల యూరియా అదనంగా అందుబాటులో ఉంచా మని, అయితే కొంత మంది యూరియాను మళ్లింపు చేస్తూ కొరత సష్టిస్తున్నారని, అట్టి వారిని గుర్తించి జాతీయ భద్రతా చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ యూరియా కేవలం వ్యవసాయ రైతులకు మాత్రమేనని, ఆక్వా, పరిశ్రమలు తదితర వ్యవసా యేతర అవసరాలకు వినియోగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరిస్తూ యూరియా మళ్లిం పుపై ఉక్కుపాదం మోపాలన్నారు. దీని పర్యవేక్షణ కోసం డివిజన్ స్థాయిలో ఆర్డీవో, మండల స్థాయిలో తహసిల్దారు, జిల్లాస్థాయిలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో కూడిన టాస్కోర్స్ కమిటీలు ఏర్పాటు చేసి తనిఖీలు చేపట్టాలని, ఆయా కమిటీలు సక్రమంగా పని చేసేలా పర్యవేక్షించాలని జాయింట్ కలెక్టర్కు సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్సో మచిలీపట్నం, గుడివాడ, ఉయ్యూరు ఆర్డీవోలు కే స్వాతి, జి బాలసుబ్రమణ్యం, బిఎస్ హేలా షారోన్, వ్యవసాయ, మత్స్య, పరిశ్రమల శాఖల అధికారులు మనోహర్ రావు తదితరులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ఆటో కార్మికులు

ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-పామర్రు: ప్రభుత్వం ఆటో కార్మికులను ఆదుకోవాలని ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.పోలి నాయుడు అన్నారు. స్త్రీ శక్తి పేరుతో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించడం వల్ల ఆటో కార్మికులకు ఉపాధికి అంతరాయం ఏర్పడిందని వారికి తక్షణమే ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరుతూ ఆటో వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) సభ్యులతో కలిసి శనివారం పామర్రు నాలుగు రోడ్ల సెంటర్లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో కార్మికుడికి వాహన మిత్ర పథకం కింద సంవత్సరానికి 25 వేల రూపాయలు ఇవ్వాలని, ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎమ్మార్వో ఆఫీస్ వరకు ఊరేగింపుగా వెళ్లి ఆర్ఐ.రాముకి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో కొడమంచిలి ప్రసాద్,కె.దిలీప్,పి. బాబురావు, నాగార్జున, టి. నాంచారయ్య, చాట్ల దానియేలు, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఓ గంగాధర్, ఇంటి రాజు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు గోశాలలు ఏర్పాటు : మంత్రి



ప్రజాశక్తి- కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం నగరంలో రహదారి ప్రమాదాలు నివారించేందుకు గోశాలను ఏర్పాటు చేశామని రాష్ట్ర గనులు భూగర్భ వనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం నగరంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో రాష్ట్ర మంత్రి జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ తో కలసి గోశాలను ప్రారంభించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం నగరంలో రహదా రులపై ఆవులు, గేదెలు ఉండటం వలన ప్రజలందరూ చాలా ఇబ్బంది పడ్డారన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందు కోసం పోలీసు, రెవెన్యూ, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, సభ్యులతో మునిసిపల్, పశుసంవర్ధక శాఖ అధికారులతో కలసి డి.ఎస్.పి నాయ కత్వంలో ఒక కమిటీని ఏర్పాటు చేశామన్నారు. వారంతా కలిసికట్టుగా ముందుకు వచ్చి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆవులు, గేదలు కోసం ప్రత్యేకించి ఒక గోశాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె నాని, కమిటీ సభ్యులు, డి.ఎస్.పి సిహెచ్ రాజా, మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, కార్పొరేటర్ అనిత పాల్గొన్నారు.



చెక్కు అందిస్తున్న ఎంఎల్ఎ వర్ల కుమార్ రాజా

ఆర్థిక సాయం అందజేత

ప్రజాశక్తి-పామర్రు : పేదలను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అమలు చేస్తున్న పి.ఫోర్ పథకం ఎంతగానో తోడ్పడుతుందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పెదపారుపూడి మండలం చిన్నపారుపూడి గ్రామానికి చెందిన కొక్కిలిగడ్డ నరేష్ లారీ డ్రైవర్ గా పనిచేస్తూ ఇటీవల ఇతర రాష్ట్రంలో మరణించారు. అక్కడనుండి మతదేహాన్ని తీసుకురావ డానికి స్వగ్రా మంలో అంతిక్రియలు నిర్వహించడానికి అవసరమైన నిధులను పి.ఫోర్ పథకం ద్వారా పెదపారుపూడికి చెందిన చప్పిడి కిషోర్ మార్గదర్శిగా 50 వేల రూపాయలను ఎమ్మెల్యే తనచేతుల మీదుగా నరేష్ కుటుంబ సభ్యులకు శనివారం తన కార్యాలయంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో యార్డ్ చైర్మన్ జన్ను శోభన్ బాబు,చాట్ల పెద రమేష్, మంతెన రామాంజ నేయులు పాల్గొన్నారు.

యుజి వన్ టైమ్ ఆపర్చునిటీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయ పరిధిలో అనుబంధ కళాశాలలకు సంబంధించి యూజి వన్ టైమ్ ఆపర్చునిటీ ఫలితాలను శనివారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె రాంజీ విడుదల చేశారని పరీక్షల నియంత్రణాధికారి డాషివీర బ్రహ్మాచారి తెలిపారు. 1658 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 1329 పేపర్స్ ఉత్తీర్ణత సాధించారని, ఉత్తీర్ణత శాతం 55.19 అని వీర బ్రహ్మాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపకులపతి ఆచార్య కె రాంజీ, కులసచీవ్ ఆచార్య ఎస్ ఉష పాల్గొన్నారు.

ఎరువుల కొరత తీర్చాలని వినతి

ప్రజాశక్తి-బంటుమిల్లి : యూరియా, పొటాషియం ఎరువులను ఎమ్మార్పీ ధరలకే రైతులకు కౌలు రైతులకు అందించాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో ఎంపి బాలశౌరి, ఎంఎల్ఎ కాగిత కృష్ణప్రసాదుకు వినతిపత్రం శనివారం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఆక్వా ఉత్పత్తులను గిట్టుబాటు ధరలకు కొనుగోలు చేస్తానని భరోసా ఇవ్వాలని, ఆక్వారంగాన్ని వ్యవసాయ రంగంగా గుర్తించి బీమా పథకాన్ని వర్తింపచేయాలని, మార్కెట్టు యార్డులలో సొసైటీలో శీతల గిడ్డంగులు నిర్మించి రైతులకు అందుబాటులోకి తేవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కష్ణాజిల్లా రైతు సంఘ కార్యదర్శి గౌరీ గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండలం రైతు సంఘం కార్యదర్శి అజయ్ ఘోష్ , తమ్ము శ్రీనివాసరావు, సిహెచ్ వెంకటకష్ణ తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా గణేష్ విగ్రహాలు పెడితే చర్యలు : డిఎస్పి



అవనిగడ్డ డిఎస్పి విద్యాశ్రీ

ప్రజాశక్తి-అవనిగడ్డ : రాబోయే వినాయక చవితి పండుగను పురస్కరించుకొని వినాయక విగ్రహాల కమిటీ ల నిర్వాహకులు పోలీసు వారి అనుమతి లేకుండా గణేష్ విగ్రహాలు ఏర్పాటు చేస్తే చర్యలు చేపట్టవలసి ఉంటుందని డిఎస్పి విద్యా శ్రీ హెచ్చరించారు. శుక్రవారం రాత్రి డీఎస్పీ కార్యాలయం వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ప్రభుత్వ ఉత్తర్వులు మేరకు గణేష్ విగ్రహం ఎత్తు 5 అడుగుల మించి ఉండరాదని, అదేవిధంగా ప్రభుత్వ స్థలాల్లో ఏర్పాటు చేస్తే తప్పనిసరిగా పంచాయతీ వారి పర్మిషన్ తీసుకోవాలన్నారు. పందిళ్లలో ఉదయం 8 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు మాత్రమే పూజలు గాని మైకు పర్మిషన్ గాని ఉంటుందన్నారు. గణేష్ పందిళ్ళలో 24 గంటలు ఒకరు ఉండాలని తప్పనిసరిగా, సీసీటీవీ లు ఏర్పాటు చేసుకోవాలన్నారు. 11 రోజుల తరువాత నిమజ్జనం చేసుకోవాలని ఎట్టి పరిస్థితుల్లోనూ డీజేలు వాడరాదని డీజేలకు పర్మిషన్ లేదన్నారు. నిమజ్జనం సందర్భంగా సినిమా పాటలు, డాన్సులు, అశ్లీల నత్యాలకు తావు లేదని సమస్యాత్మక ప్రాంతాల వై దష్టి సారించి ప్రత్యేక నిఘా పెట్టడంతో పాటు గతంలో వివాదాలకు కారణమైన వ్యక్తులను బైండవర్ చేయడం జరుగు తుందన్నారు. **ప్రజాశక్తి-మోపిదేవి :** వినాయక చవితి పండుగను అల్లరు, గొడవలు లేకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని మోపిదేవి ఎస్సై యెలుగుబంటి వీర వెంకట సత్యనా రాయణ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ ఉత్సవ కమిటీ ఏర్పాటు చేసుకునే పందిళ్ళ నిర్వాహకులకు ప్రభుత్వం వెబ్ సైట్ ను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. గణేష్ ఉత్సవ్ డాట్ నెట్ వెబ్ సైట్ లో కమిటీ సభ్యులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. **ప్రజాశక్తి-పామర్రు :** వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేవారు తప్పనిసరిగా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని పామర్రు సర్కిల్ సీఐ సుభాకర్ అన్నారు. శనివారం ఆయన కార్యాలయంలో ఉత్సవ నిర్వహణ కమిటీ వారికి మహిళా పోలీస్ సిబ్బందికి ఉత్సవాల నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉత్సవాలు నిర్వహించినంత కాలం పందిరి వద్ద బాధ్యతగా కమిటీ వారు ఉండాలని, ట్రాఫిక్ ఎటువంటి అంతరాయము కలిగించరాదని తెలిపారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** వినాయకచవితి ఉత్సవాలు నిర్వహించేవారు నిబంధనలు తప్పనిసరిగా పాటిం చాలని, ఏవిధమైన సంఘటనలు జరిగినా కమిటీదే బాధ్యత అని ఉయ్యూరు పట్టణ సీఐ టీ వీవీ రామారావు అన్నారు. పట్టణ పరిధిలో వినాయక చవితి ఉత్సవాల నిర్వాహకు లు, డీజే, మైక్ లైటింగ్ సర్వీసుల వారితో శనివారం సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

పంట కాల్వలో మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : పెడనలోని మునిసి పల్ వాటర్ హౌస్ రామరాజు పంట కాలువలో శనివారం మృతదేహం లభ్యమైంది. మృతుడు పట్టణంలోని దక్షిణ తెలుగు పాలెంకు చెందిన కోమట్ల శివ నాగరాజు (43)గా గుర్తించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు, తల్లీ ఉన్నారు. 10 సంవత్సరాల క్రితం నాగరాజు తన భార్య జ్యోతితో గొడవపడి విడిపోయారు. అప్పటి నుంచి కూడా తల్లి సంపూర్ణమ్మ దగ్గర ఉంటున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం తన బంధువు చనిపోవడంతో మట్టి చేయడానికి వెళ్లి కాలువలో స్నానానికి దిగి చనిపోయాడు. మృతుడి అన్న కుమారుడు కోమట్ల సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారం చేపట్టారు. సంఘటన స్థలాన్ని పెడన సర్కిల్ ఇన్స్పెక్టర్ కె నాగేంద్రప్రసాద్, ఎస్సై జి సత్యనారాయణ సందర్శించి మృతదేహాన్ని కాలువలో నుంచి బయటకు తీయించి పోస్టుమార్టం నిమిత్తం మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

చోరీ కేసులో దొంగ అరెస్టు

ప్రజాశక్తి- గన్నవరం : వరుస దొంగాతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్ట్ చేసి అతని వద్ద నుండి సుమారు 7 లక్షల రూపాయల విలువైన బంగారు ఆభరణాలు, మూడు మోటార్ సైకిళ్ళు, స్వాధీనం చేసుకున్నట్లు డి.ఎస్.పి శ్రీనివాసరావు తెలిపారు. గన్నవరం పోలీస్ స్టేషన్లో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉంగుటూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఈనెల 3వ తేదీన అర్ధరాత్రి సమయంలో వెన్నుతల గ్రామంలో బొమ్మి సింహాచలం ఇంట్లిలో ఎవరో గుర్తుతెలియని వ్యకి ఆమె వద్దకు వచ్చి భయపెట్టి ఆమె మేడలో ఉన్న మూడు కాసుల బంగారపు గోలుసు లాక్కొని వెళ్లిపోయాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. దానిపై గన్నవరం సీఐ శివ ప్రసాద్ నేతత్వంలో ఒక ప్రత్యేక టీం ఏర్పాటు చేసి అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో విజయవాడకు చెందిన పాత నేరస్థుడు అయిన బుగత శివను అరెస్టు చేసినట్లు వివరించారు. ఇతనపై గతంలో చేబ్రోలు, తాడేపల్లిగూడెం, గండేపల్లి, ఏలూరు రూరల్, విజయవాడ పోలీస్ స్టేషన్ లలో సుమారు 20కి పైగా దొంగతనం కేసులున్నాయన్నారు. మృతుడు నుంచి బంగారు ఆభరణాలు, మూడు మోటారు సైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవాలి : మున్సిపల్ కమిషనర్



ప్రజాశక్తి - గుడివాడ : పట్టణ పరిధిలోని ప్రతి వ్యాపారస్తుడు ట్రేడ్ లైసెన్స్ కలిగి ఉండాలని లేని వారిపై మున్సిపల్ చట్ట ప్రకారం చర్యలు తీసుకుం టామని మున్సిపల్ కమిషనర్ మనోహర్ తెలిపారు. ఈ సందర్భంగా శనివారం అయన విలేకర్లతో మాట్లాడుతూ పట్టణ పరిధిలోని ప్రతి వ్యాపారస్తుడు ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. ట్రేడ్స్ గెజిట్ నోటిషికేషన్ ప్రకారము అప్లికేషన్ పూర్తి చేసి, నిర్ణీత ఫీజు చెల్లించి ప్రతి వ్యాపారస్తుడు తప్పనిసరిగా ట్రేడ్ లైసెన్స్ పొందాలన్నారు. అవగాహన లేమితో కొందరు వ్యాపారస్తులు ట్రేడ్ లైసెన్స్ తీసుకోవడంలో నిర్లక్ష్యం వహించడం సరికాదన్నారు. ఇప్పటికే స్పెషల్ డ్రైవ్లు మొదలు పెట్టామన్నారు. గత 15 రోజుల వ్యవధిలో 3 వందల మంది వ్యాపారస్తులు కొత్తగా లైసెన్సులు పొందినట్లు తెలిపారు. లైసెన్సులు లేని వ్యాపారస్తులపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రజకుల సమస్యలను పరిష్కరించాలని కరపత్రాల పంపిణీ

విజయవాడ : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం రజకుల సమస్యలు పరిష్కరించాలని విజయవాడ మున్సిపల్ కార్యాలయం దగ్గర జరిగే నిరసన ధర్నాను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం కరపత్రాలు ఆవిష్కరణ జరిగింది. ఈ కరపత్రాలను అజిత్‌సింగ్‌నగర్ సుందరయ్య కాలనీ రజక వీధిలో పంపిణీ చేసి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రజక వత్తిదారుల సంఘం విజయవాడ నగర అధ్యక్షులు లింగాల నిర్మలమ్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్మలమ్మ మాట్లాడుతూ రజక మహిళలకు భద్రత కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. రజకులకు సామాజిక రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని, రజకులకు 50 సంవత్సరాలకే పెన్షన్ ఇవ్వాలని, నగరంలో ఉన్న దోబీ గాట్లకు మరమ్మత్తులు చేయాలని, వత్తి చేసేందుకు అనువుగా మోడ్రన్ దోబీగాట్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమంలో పొనుగోటి జగన్, శివ పార్వతి, దుర్గ భవాని, చిన్న భవాని రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మను దర్శించుకున్న హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన శ్రీ కనక దుర్గమ్మను ఎపి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గోపాలకృష్ణారావు కుటుంబ సమేతంగా సందర్శించారు. శనివారం ఉదయం హైకోర్టు న్యాయమూర్తి గోపాలకృష్ణారావు తన కుటుంబ సభ్యులతో కలిసి ఇంద్రకీలాద్రికి వచ్చారు. ఆలయానికి వచ్చిన ఆయనకు ఆలయ కార్యనిర్వహణాధికారి శీనానాయక్ ఘన స్వాగతం పలికారు. ఆలయ సంప్రదాయాల ప్రకారం దర్శన ఏర్పాట్లు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ వి.గోపాలకష్ణారావు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.



ఉత్కంఠగా ఇంటర్నేషనల్ చెస్ పోటీలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

స్థానిక పి బి సిద్ధార్థ కాలేజీలో ఎస్ఆర్ఆర్ చారిట బుల్ ట్రస్ట్ నిర్వహిస్తున్న ఎస్ఆర్ ఆర్ ఫీడే ఇంటర్నేషనల్ రేటింగ్ చెస్ ఛాంపియన్షిప్ రెండవ రోజు పోటీలు ఉత్కంఠగా జరుగుతు న్నాయి. ఈ టోర్నమెంట్‌లో భారతదేశంతోపాటు కెనడా, ఇంగ్లాండ్, కెన్యా, అమెరికా, సౌత్ ఆఫ్రికా దేశాల క్రీడాకారులు మొత్తం 409 మంది, అందులో 28 మంది అంతర్జాతీయ క్రీడాకారులు పాల్గొన్నారని టోర్నమెంట్ ఆర్గనైజర్ ఫణి కుమార్ తెలిపారు. మూడవ రౌండ్ ముగిసేసరికి రాష్ట్ర క్రీడాకారులు చిన్నం వైష్ణవి, కావ్య శ్రీ, హేమల్ వర్షన్, గొర్లి నైనా, గిరిధర్ మూడేళ్ల, సీత సాగర్, లక్ష్మణరావు, కోట కల్పక్ హర్ష కీర్తన్, సింహాద్రి సాయి హషికేష్‌లతో పాటు కెన్యా నుంచి యస్మిత్ రామ్ చైకం, 27 మంది క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. కర్ణాటక, తెలంగాణ, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒరిస్సా, వెస్ట్ బెంగాల్ నుంచి 3 పాయింట్లతో ముందంజలో ఉన్నారు. నాల్గవ రౌండ్ లో అద్విక్ అభినవ్ కష్ణ, బాలకిషన్, సంతోష్ హరి హరన్, తన్విష్ రెడ్డి, అద్విక్ లెనిన్ లు అద్విక్ అమిత్ అగర్వాల్, సారిక దర్భ, విజయ్ శ్రీరామ్, వినయ్ కుమార్, సీతాసాగర్ లు తలపడుతున్నారు.

ప్లాస్టిక్ రహిత నగరంగా తీర్చిదిద్దాలి

- జిల్లా ఇన్చార్జి అధికారి జయలక్ష్మి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ



ప్లాస్టిక్ రహిత నగరంగా విజయవాడను తీర్చిదిద్దాలని జిల్లా ఇన్‌ఛార్జ్ అధికారి జయలక్ష్మీ తెలిపారు. విజయవాడలోని చిట్టినగర్ సర్కిల్ 1 కార్యాలయంలో స్వర్ణాంధ్ర -స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎన్టీఆర్ జిల్లా ఇన్‌చార్జి అధికారి జి.జయలక్ష్మి, నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబల కుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. నగరంలో డీసిల్టింగ్, వర్షపు నీరు రోడ్డుపైన నిల్వ ఉండకుండా మొన్సూన్ రెస్పాన్స్ టీం పలు చర్యలు చేపట్టాలని, ఇప్పటి వరకు తీసుకుంటున్న చర్యలను కొనసాగించాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ దగ్గర గుడ్డ సంచి ఉంచుకొని, బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలను వేయకుండా ఆ సంచిలో వేసి చెత్తబుట్ట ఉన్నచోట ఆ సంచిలోని వ్యర్థాలను వేయాలని, తద్వారా కాలువల్లో వ్యర్థాలు వేసే అవకాశం ఉండదని తెలిపారు. మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణలో దేశంలోనే అత్యంత ఉత్తమమైన సూపర్ స్వచ్ లీగ్ పురస్కారం విజయవాడ అందుకుదంటే అది సాధారణమైన విషయం కాదని, అది కేవలం పారిశుధ్య కార్మికుల వలనే సాధ్యమైందని అన్నారు. ధ్యానచంద్ర మాట్లాడుతూ శానిటేషన్ మెరుగుదలకు, సీజనల్ వ్యాధుల నివారణకు నగరపాలక సంస్థ పలు చర్యలు తీసుకుంటుందని అన్నారు.



వైద్యుడి నిర్లక్ష్యంతో వ్యక్తి మృతి

- బంధువుల ఆందోళన

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

వైద్యుడి నిర్లక్ష్యం కారణంగా ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపల్లిలో ఓ ప్రవేటు హాస్పిటల్‌లో శనివారం చోటు చేసుకుంది. బాధితుల వివరాల ప్రకారం. కొండపల్లికి చెందిన ఇబ్రహీం (40)కు గుండెల్లో నొప్పుగా ఉందంటూ ఆస్పత్రికి వచ్చారు. వైద్యులు పరీక్షించి గ్యాస్ నొప్పి అంటూ ఇంజక్షన్ ఇచ్చి పంపించేశారు. ఇంటికి వచ్చిన కొద్దిసేపటికే ఇబ్రహీం మృతి చెందారు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు ఆస్పత్రి ఎదుట ఆందోళనకు దిగారు. డాక్టర్ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడం వల్లే ఇబ్రహీం మృతి చెందాడంటూ ఆందోళన చేశారు. తమ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అందుకున్న పోలీసులు ఆస్పత్రి వద్దకు చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి పంపించేశారు.

యువ మేధకు చుక్కాని.. ఆర్‌టిఐహెచ్

- జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ

ప్రజాశక్తి-విజయవాడ



యువ మేధస్సుకు పదునుపెట్టి, ఆపై ప్రోత్సహించి పరిశ్రమల స్థాపన దిశగా చేయిపట్టి నడిపించడంలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్ (ఆర్‌టిఐహెచ్) కీలకపాత్ర పోషిస్తుందని.. విజయవాడ స్పోక్‌ను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లడంలో టీమ్ - ఆర్‌టిఐహెచ్ కొత్త ఉత్సాహంతో ముందుకెళ్లాలని జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ అన్నారు. ఎనికేపాడులోని ఆర్‌టిఐహెచ్ స్పోక్ కార్యాలయానికి సంబంధించి సిఇఒగా జి.కష్ణన్, ఇంక్యుబేషన్ హెడ్‌గా డి.రవితేజకు జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ కలెక్టరేట్‌లో శనివారం నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జెసి.. సీఈవో, ఇంక్యుబేషన్ హెడ్‌లకు శుభాకాంక్షలు తెలియజేశారు. కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా తీర్చిదిద్దేందుకు అమరావతిలో రతన్‌టాటా ఇన్నొవేషన్ హబ్‌తో పాటు దీనికి అనుసంధానంగా విజయవాడతో పాటు రాష్ట్రంలో మొత్తం అయిదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను గౌరవ ముఖ్యమంత్రి ప్రారంభించారని.. ఆర్‌టీఐహెచ్ స్ఫూర్తికి అనుగుణంగా అధికారులు, సిబ్బంది బంద స్ఫూర్తితో పనిచేసి సంస్థను విజయవంతంగా ముందుకు తీసుకెళ్లాలని జేసీ ఇలక్కియ సూచించారు.

మెరుగైన సౌకర్యాల కల్పనే లక్ష్యం

- దుర్గగుడి ఇఒ శీనా నాయక్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ



పనులను పరిశీలిస్తున్న ఇఒ

మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించడమే లక్ష్యం దుర్గగుడి ఇఒ వి.కె. శీనా నాయక్ తెలిపారు. ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న పలు అభివృద్ధి పనులను ఆయన శనివారం పరిశీలించారు. రానున్న దసరా మహోత్సవాల నేపథ్యంలో పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. సందర్శకులు సులభంగా తమ వస్తువులను, మొబైల్ ఫోన్లను డిపాజిట్ చేసేందుకు వీలుగా మహా మండపం వద్ద రెండో మొబైల్ డిపాజిట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని ఈఓ నిర్ణయించారు. దీని ద్వారా రద్దీని నియంత్రించవచ్చని ఆయన తెలిపారు. యాత్రికులకు నిరంతరాయంగా అన్నదానం అందించేందుకు, కొత్తగా నిర్మిస్తున్న అన్నదాన భవనంలో తాత్కాలిక ఏర్పాట్లను సమీక్షించారు. పనులను త్వరగా పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దసరా ఉత్సవాల నేపథ్యంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని సూచించారు. యాత్రికుల రద్దీని దష్టిలో ఉంచుకుని మహా మండపం వద్ద నిష్క్రమణ ద్వారంను పరిశీలించారు. రద్దీ ఎక్కువగా ఉన్నప్పుడు సందర్శకులు సురక్షితంగా బయటకు వెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. కొత్త క్లాక్ రూమ్, సమాచార కేంద్రం, చెప్పుల స్టాండ్స్ తదితర సౌకర్యాలు ఏర్పాటు చేయాలని ఈఓ యోచిస్తున్నారు. ఈ విషయంపై ఆయన ఇంజినీరింగ్ విభాగం అధికారులతో సమీక్షించారు. యాత్రికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం, పండుగల వేళ భద్రతకు ప్రాధాన్యత ఇవ్వడమే తమ ప్రధాన లక్ష్యమని ఈఓ శీనా నాయక్ ఈ సందర్భంగా మీడియాకు తెలిపారు.

బీమా పథకాలు అమలు చేయాలి

- బోయి సత్యబాబు

ప్రజాశక్తి - విజయవాడ సిటీ



ఈ శ్రమ ఇన్సూరెన్స్ నమోదును పరిశీలిస్తున్న సత్యబాబు

ఈ శ్రమ ఇన్సూరెన్స్ నమోదు కార్డుల ప్రక్రియ గత నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్నా లబ్ధిదారులకు ఫలితాలు సక్రమంగా అందడం లేదని కార్పొరేటర్ బి.సత్య బాబు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ, ఈ శ్రమ పేరుతో ఆన్లైన్ కార్యక్రమం 50వ డివిజన్లోని 170 సచివాలయం వద్ద లేబర్ డిపార్ట్‌మెంట్ ఏర్పాటు చేసిన కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భవ హెల్త్ కార్డు.. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్యశ్రీలో భాగంగా ఉంటుందని, ఇతర రాష్ట్రాల్లో మాత్రమే ఇది ఐదు లక్షల వైద్య సదుపాయాలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. దీంట్లో సహజ మరణానికి కార్మికుల కుటుంబానికి ఎటువంటి భీమా పథకాలు అమలు నిబంధనలు లేవని తెలిపారు. గతంలో చంద్రన్న భీమా పేరుతో సహజ మరణానికి 18 నుంచి 60 సంవత్సరాల వరకు ఉన్న వారికి రూ.రెండు లక్షలు, ప్రమాద భీమాకి 70 సంవత్సరాల వరకు రూ.ఐదు లక్షలు ఉన్న వాటిని అమలు చేయకుండా ఏడాదిన్నర అవుతున్నా పట్టించుకోకపోవడం సరికాదన్నారు. బీమా పథకాలు సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

నేటి నుండి కబడ్డీ సూపర్ లీగ్ పోటీలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

ఆంధ్రా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కబడ్డీ లీగ్ పోటీలలో ఆదివారం నుండి సూపర్ 4 లీగ్ మ్యాచ్‌లు జరుగుతాయని అసోసియేషన్ కార్యదర్శి శ్రీకాంత్ తెలిపారు. శనివారం పోటీలను పటమట చిన్నపాటి రామ కోటయ్య ఇండోర్ స్టేడియం నందు ఏలూరు కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ కె.రంగారావు, సీనియర్ కబడ్డీ క్రీడాకారుడు రాధ కష్ణ ప్రారంభించారు. శనివారం జరిగిన మ్యాచులో కర్నూలు జట్టు కష్ణా జట్టు పై విజయం సాధించారు. విజయనగరం జట్టు 59-48 పాయింట్లతో విజయనగరం జట్టు విజయం సాధించింది.

ఎయిడ్స్ నియంత్రణపై సదస్సు

ప్రజాశక్తి-కంచికచర్ల

ఆంధ్రప్రదేశ్ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఆదేశాలు మేరకు జిల్లా వైద్యారోగ్య శాఖ, జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం సహకారంతో కృష్ణ వెన్నెల మహిళా సొసైటీ సిసి ప్రాజెక్ట్ ఆధ్వర్యాన స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో హెచ్ఐవి, ఎయిడ్స్ నియంత్రణపై అవగాహనా సదస్సు శనివారం నిర్వహించారు. ప్రాజెక్ట్ ప్రతినిధి బి.ప్రసాద్ మాట్లాడుతూ హెచ్ఐవి లక్షణాలు రాకుండా ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలో సూచించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ హెచ్ఎం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కల్లుగీత కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : కల్లుగీత కార్మికులకు ఉపాధి, మార్కెట్ సౌకర్యం కల్పించాలని కల్లు గీత కార్మికుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వాకా రామచంద్రరావు కోరారు. శనివారం మచిలీపట్నంలోని బుట్టాయిపేట జ్యోతిబాపూలే విజ్ఞాన కేంద్రంలో కల్లు గీత కార్మికుల సమస్యలపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమిళనాడు, కేరళ, తెలంగాణ రాష్ట్రాలలో కల్లుగీత వత్తికి లభిస్తున్న ప్రయోజనాలను అధ్యయనం చేసి మన రాష్ట్రంలో కూడా ఉపాధి, మార్కెట్ సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మాదిరి మన రాష్ట్రంలో కూడా హైబ్రిడ్ తాటి, ఈత వనాలను అభివద్ధి చేస్తూ నీరా పరిశ్రమ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. తాడిచెట్టిపై కల్లుగీత గీస్తూ పడిపోయి మరణించిన కార్మికులకు 10 లక్షల ఎక్స్గ్రేషియా ప్రకటించాలన్నారు. శాశ్వతంగా వైకల్యం పొందిన వారికి ఐదు లక్షల చొప్పున ఇవ్వాలన్నారు. తాత్కాలిక వైకల్యంతో బాధపడే వారికి లక్ష రూపాయలు నష్టపరిహారం ఇప్పించాలన్నారు. ఇటీవల కోడూరు మండలంలో ఉల్లిపాలెం గ్రామానికి చెందిన యేసు అనే గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి చనిపోయాడన్నారు. అలాగే తాటి చెట్టు పై నుంచి పడి వైకల్యంతో బాధపడుతున్న కోడూరు మండలం స్వతంత్రపురం గ్రామానికి చెందిన మోరల కోటేశ్వరావు, గుడ్లవల్లేరు మండలం దేశాయ గుంటకు చెందిన పామర్తి సత్యనారాయణ లకు నష్టపరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. కుల కార్పోరేషన్ ద్వారా కాకుండా కల్లుగీత ఆర్థిక కార్పొరేషన్ పునరుద్ధరించి నిధులు కేటాయించి చనిపోయిన కార్మికుల కుటుంబాలకు మట్టి ఖర్చులు కింద 30 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఈనెల 30వ తేదీ శనివారం మచిలీపట్నం బలరాముని పేట ఎక్సైజ్ కార్యాలయం వద్ద గీత కార్మికులతో నిరసన కార్యక్రమం ఉంటుందని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం సీనియర్ నాయకులు కొడాలి శర్మ కల్లుగీత కార్మిక సంఘం సొసైటీ అధ్యక్షులు పడమటి దుర్గారావు, బొర్రా రాము, పామర్తి వెంకటేశ్వరరావు, పరస శ్రీనివాసరావు, వెంకటరావు పాల్గొన్నారు. అనంతరం బలరామునిపేటలోని జిల్లా ఎక్సైజ్ కార్యాలయంలో ఉప పర్యవేక్షణ అధికారులు జి గంగాధర్ రావు, చాగలమర్రి భార్గవ్ లకు వినతిపత్రం అందజేశారు.



రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న నాయకులు



ఆర్‌ఒ ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : రాష్ట్రంలో అన్న క్యాంటీన్లు పేదవాళ్ల ఆకలిని తీరుస్తూ విజయవంతంగా నడుపుతున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. శనివారం మచిలీపట్నం నగరంలోని మూడు స్తంభాల సెంటర్ వద్ద గల అన్న క్యాంటీన్లో రాష్ట్ర మంత్రివర్యులు దాతల సహకారంతో 75 వేల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ వాటర్ ప్లాంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వైద్యులు ధన్వంతరి వారి మనవడు డాక్టర్ బి.వి. వివేక్, డాక్టర్ వైష్ణవిల వివాహ సందర్భంగా అన్న క్యాంటీన్లో 75 వేల రూపాయల వ్యయంతో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడం ఎంతో అభినందనీ యమన్నారు. మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాల్ రావు, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గొర్రెపాటి గోపిచంద్, వైద్యులు ధన్వంతరి, వివేక్, వైష్ణవి పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ

ప్రజాశక్తి-మోపిదేవి : మండలంలోని నాగాయితిప్ప పిఎసిఎస్‌లో ఎరువులు పంపిణీని చైర్ పర్సన్ బళ్లా సీతారామ ప్రసాద్ పాలకవర్గ సభ్యులతో కలిసి ప్రారంభించారు. సొసైటీకి 200 కట్టల డిఏపి ఎరువులు శుక్రవారం సాయంత్రం రాగా వాటిని అవసరమైన రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరకే పంపిణీ చేస్తునట్లు సీతారాం ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు రేపల్లె మునీశ్వర రావు, కార్యదర్శి భోగాది లంకేశ్వరరావు, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ పుప్పాల ఏసు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనంలో పురుగులు

ప్రజాశక్తి -నందివాడ : మండల కేంద్రమైన నందివాడ జడ్‌పిహెచ్ పాఠశాలలో మధ్యాహ్న భోజనంలో పురుగులు, తల వెంట్రుకలు, రాళ్ల రావడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఉన్న ప్రతి స్కూల్లో ఇదే పరిస్థితి ఉందని, ప్రభుత్వం మధ్యాహ్న భోజనంలో భాగంగా పాఠశాలలకు పంపిణీ చేసే బియ్యంలో నాణ్యత లోపించడంతో పాటు బూజు, పురుగులు వస్తున్నాయని విద్యార్థులు పేర్కొంటున్నారు. దీంతో మధ్యాహ్న భోజనం చేయాలంటే తమకు భయమేస్తోందని, ఇళ్ల నుంచి క్యారేజీలు తెచ్చుకుంటున్నామని విద్యార్థులు తెలిపారు. పై అధికారులు ఎవరైనా వస్తే భోజనం పరిశుభ్రంగా ఉంటుందని విద్యార్థినిలు తెలియజేశారు. ఈ విషయాన్ని ఉపాధ్యాయులకు తెలియ జేసినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు.



పురుగులు చూపిస్తున్న విద్యార్థులు



క్రీడా దినోత్సవ కరపత్రం ఆవిష్కరణ



ప్రజాశక్తి-అవనిగడ్డ : ఈనెల 29 వ తేదీన నిర్వహించనున్న జాతీయ క్రీడ దినోత్సవం పురస్కరించుకొని అందుకు సంబంధించిన వాల్‌పోస్టరును ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ఆవిష్కరించారు .శనివారం సాయంత్రం అవనిగడ్డలోని ఎమ్మెల్యే కార్యాలయంలో సబ్ జోన్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతీయ క్రీడా దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈనెల 25,26 తేదీలలో కోడూరు మండలంలోని వి కొత్తపాలెం జడ్పీ హైస్కూల్ లో ఆటల పోటీలు, 29వ తేదీ అవనిగడ్డ ప్రభుత్వ ఉన్నత పాఠశాల లో జాతీయ క్రీడ దినోత్సవం వేడుకలు బహుమతి ప్రధానోత్సవం క్రీడజ్యోతి ర్యాలీ ఏర్పాటు చేసిన వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు బి వెంకటేశ్వరరావు, కార్యదర్శి బిపిఎల్ ప్రసాద్, ట్రెజరర్ టి నవీన్, సభ్యులు సిహెచ్ సుబ్బారావు, ఎం శ్యాం కుమార్ పాల్గొన్నారు

రెండో రోజుకు ఎడ్లలంకవాసుల దీక్ష

ప్రజాశక్తి-అవనిగడ్డ : వరద ఉధృతికి గ్రామంలో గృహాలు నదిలో కలిసిపోతున్నాయని తమ జీవనం ఇబ్బందికరంగా ఉండటంతో ఎడ్ల లంక గ్రామస్తులు తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం నుండి నిరసన దీక్ష చేపట్టారు. శనివారం కూడా గ్రామస్తులంతా ప్రధాన కూడలిలో శిబిరం ఏర్పాటు చేసుకొని దీక్ష నిర్వహించారు. గత ఏడేళ్ల నుండి కష్ణా నదికి వరదలు వచ్చిన సందర్భంలో నది ఉధతికి గహాలు కూలిపోతున్నాయని ఎన్నిసార్లు అధికారులకు ప్రభుత్వానికి మొరపెట్టుకున్నా ఫలితం లేకపోవడంతో దీక్షకు పూనుకోవాల్సి వచ్చిందని తెలుపుతున్నారు. తక్షణమే తమ గ్రామం కోతకు గురి కాకుండా రివిట్మెంట్ వాల్ ఏర్పాటు చేయాలని, రహదారి బ్రిడ్జి నిర్మించాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ నినాదాలు చేశార.ు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులంతా పాల్గొన్నారు.

వైసీపీ నాయకులు సంఘీభావం : పాత ఎడ్ల లంక గ్రామస్తుల నిరసన దీక్షకు వైసిపి మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ సమన్వయకర్త సింహాద్రి రమేష్ బాబు, మాజీ ఏఎంసీ చైర్మన్ కడవకొల్లు నరసింహారావు మద్దతు తెలిపారు. శనివారం ఆ గ్రామానికి వెళ్లిన వీరు బాధితులను కలసి తమ మద్దతు తెలుపుతూ ఎడ్ల లంక గ్రామ సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో పని చేయాలని, గ్రామం కోతకు గురవుతున్న ప్రాంతాన్ని రక్షణ కూడా కట్టించి రక్షించాలన్నారు. నివాసాలు కోల్పోయిన వారికి తక్షణమే ఇల్లు కట్టించి ఇవ్వాలని రమేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, వైసీపీ ప్రచార విభాగం రాష్ట్ర కార్యదర్శి గాజుల జై గోపాల్, మండల పార్టీ కన్వీనర్ రేపల్లె శ్రీనివాసరావు, పాత ఎడ్ల లంక మాజీ సర్పంచ్ సైతం బాబురావు సంఘీభావం తెలిపారు.

పాత ఎడ్ల లంక గ్రామాన్ని సందర్శించిన ఆర్‌డిఒ : కృష్ణా నది వరదల వల్ల నది కోతకు గురవుతున్న పాత ఎడ్ల లంక గ్రామాన్ని ఆర్డిఓ స్వాతి ఇరిగేషన్ అధికారులతో కలిసి కోతకు గురవుతున్న ప్రాంతాన్ని శనివారం సందర్శించారు. ఇక్కడ పరిస్థితుల గురించి గ్రామస్తులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఆర్డీవో తో పాటు ఇరిగేషన్ ఆర్ అండ్ బి అధికారులు, ఎమ్మార్వో కె నాగ మల్లేశ్వరరావు, ఇన్చార్జి ఎంపీడీవో వనజ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న ఆర్‌డిఒ

విఆర్‌ఎ నుండి టీచరుగా...

- ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించిన రావివారిపాలెం మహిళలు





ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి శివారు రావారిపాలెం గ్రామానికి చెందిన ఇద్దరు మహిళలు టీచర్ ఉద్యోగాలు సాధించారు. ప్రభుత్వం విడుదల చేసిన డీఎస్సీ మెరిట్ లిస్ట్ లో గ్రామానికి చెందిన పోలిమెట్ల స్వయంప్రభ, మేక అశ్లేషలు ఉద్యోగాలు సాధించారు. స్వయంప్రభ సోషల్ లో 76.94 మార్కులతో ఓపెన్ క్యాటగిరిలో టీచరు పోస్ట్ సాధించింది. ఈమె ప్రస్తుతం మోపిదేవి తాసిల్దార్ కార్యాలయంలో వీఆర్ఏగా విధులు నిర్వహిస్తోంది. అలాగే మేక ఆశ్లేష మోపిదేవిలో ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తుంది. డీఎస్సీ లో మెరిట్ లిస్టులో 11వ ర్యాంకు సాధించి స్కూల్ అసిస్టెంట్ టీచర్ పోస్ట్ సాధించింది. ఈ సందర్భంగా గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు వీరిని అభినందించారు.

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి : సిఐ

ప్రజాశక్తి-గన్నవరం : గంజాయి కేసుల్లో ఉన్నవాళ్లలో ఎక్కువమంది బీటెక్, డిగ్రీలు చేసిన కుర్రోళ్ళు ఉన్నారని, వాళ్లకు భవిష్యత్తు లేకుండా పోయిందని నార్కోటిక్, (ఈగల్) సీఐ రవీంద్ర చెప్పారు. శనివారం గన్నవరం మండలం కేసరపల్లి వికేఆర్ కళాశాలలో మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన సదస్సు జరిగింది. రవీంద్ర మాట్లాడుతూ తాను రాజమండ్రి సెంట్రల్ జైలుకు పరిశీలన కోసం వెళితే గంజాయి కేసుల్లో ఇరుక్కుని జైలులో ఉన్న వాళ్ళలో ఎక్కువమంది చదువుకున్న యువకులే ఉన్నారని తెలిపారు. అందువల్ల ప్రతి విద్యార్థి గంజాయికి దూరంగా ఉండాలన్నారు. గంజాయి రహిత రాష్ట్రంగా ఉండాలని ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటుందన్నారు. గన్నవరం సీఐ బేవీ శివప్రసాద్ మాట్లాడుతూ.. మతకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం సర్వనాశనం అవుతుందని, కుటుంబానికి దూరమవుతారని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల పరిశీలనలో తప్పులు లేకుండా చూడాలి : డిఇఒ

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : మెగా డీఎస్సీ-2025 అర్హత సాధించిన ఉపాధ్యాయ నియామకాల సర్టిఫికెట్ల పరిశీలనలో ప్రభుత్వ నిబంధనలు తూచా తప్పకుండా పాటించాలని ఏదైనా పొరపాటు జరిగితే ఆయా టీమ్ సభ్యులే బాధ్యత వహించాల్సి ఉంటుందని జిల్లా విద్యాశాఖాధికారి పివిజె రామారావు సూచించారు. శనివారం స్థానిక నోబుల్ కళాశాలలో శనివారం మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు సంబంధించి సర్టిఫికెట్ల పరిశీలనపై విద్యాధికారులు వెరిఫికేషన్ కమిటీ సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యా శాఖాధికారి మాట్లాడుతూ సర్టిఫికెట్ పరిశీలన ప్రక్రియలో గోప్యతను కచ్చితంగా పాటించాలన్నారు. ఒరిజినల్ డాక్యుమెంట్స్ తప్ప మరే కాపీలను అంగీకరిం చరాదన్నారు. కలర్ జిరాక్స్ లేదా ఫొటోస్టాట్ కాపీలను గుర్తించి తిరస్కరించాలని స్పష్టం చేశారు. ఫేక్ సర్టిఫికెట్లు, ఫేక్ కుల ధవీకరణలు, నకిలీ యూనివర్సిటీ డిగ్రీలపై ప్రత్యేక దష్టి సారించాలన్నారు.ఈ కార్యక్రమంలో డివైఈఓలు, ఎం ఈ ఓ,ప్రధానోపా ధ్యాయులు, ఉపాధ్యాయులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

'స్త్రీశక్తి'కి అపూర్వ స్పందన

ప్రజాశక్తి-గన్నవరం : స్త్రీ శక్తి పథకానికి మహిళల నుండి అపూర్వ స్పందన లభిస్తోందని కృష్ణాజిల్లా ఆర్టీసీ ప్రజా రవాణా అధికారి కొడమంచిలి వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం ఆయన గన్నవరం డిపోను సందర్శించారు. గన్నవరం డిపోలో 61 బస్సులకు గాను, 51 బస్సులకు లిస్త్రీ శక్తిలి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణానికి అనుమతి ఉందన్నారు. స్త్రీ శక్తిలి పథకం ఈనెల 15వ తేదీన ప్రారంభించిన రోజు నుంచి 22వ తేదీ వరకు అనగా 8 రోజులకు గాను గన్నవరం డిపో బస్సులలో 1, 10,000 మంది మహిళలు ఉచిత ప్రయాణం చేశారని, 34 లక్షల రూపాయలు రాయితీ పొందారని ఆయన తెలిపారు.

ఫ్లోరైడ్ బాధితులకు తోడ్పాటు

ప్రజాశక్తి - తిరువూరు

తిరువూరు మండలం కొమ్మిరెడ్డిపల్లి గ్రామ దళితపేట ప్రజలను వెంటాడుతున్న ఫ్లోరైడ్ సమస్య బారినుండి ఆదుకునేందుకు మాజీ ఎఎంసి చైర్మ న్, వైసిపి మండల మాజీ అధ్యక్షులు శీలం నాగ నర్సిరెడ్డి తన కుటుంబ సభ్యులతో కలిసి తోడ్పాటు అందించారు. గ్రామంలోని తాగు నీటిలో ఫ్లోరైడ్ అధికంగా ఉండటం, కిడ్నీ సమస్యలు తలెత్తడంతో దళిత ప్రజలు రోగాల పాలవుతున్నారు. వారు పడుతున్న కష్టాన్ని చూసి వాటర్ ప్లాంట్ నిర్మాణానికి నాగ నర్సిరెడ్డి రూ.రెండు లక్షలు, తన కుటుంబ సభ్యులైన వేమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి (లేటు) పేరుతో రూ.50 వేలు, వేమిరెడ్డి రాజారెడ్డి రూ.50 వేలు మొత్తం రూ.3 లక్షల చెక్కును సర్పంచ్ బంక వెంక టేశ్వర్లకు శనివారం అందజేశారు. ఫ్లోరైడ్ రహిత వాటర్ ప్లాంట్ నిర్మాణానికి విరాళం అందజేసిన నాగనర్సిరెడ్డిని కొమ్మిరెడ్డిపల్లి గ్రామస్తులు అభినందించారు.

ఎన్‌టిటిపిఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

ఎన్‌టిటిపిఎస్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని స్వతంత్ర కుమార్ తెలిపారు. ఎన్‌టిటిపిఎస్‌లో పని చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల దీర్ఘకాల సమస్యల పరిష్కారం కోసం కాంట్రాక్ట్ కార్మికుల ముఖ్య సమావేశం శనివారం ఏ కాలనీలో జరిగింది. ఈ సమావేశంలో స్వతంత్ర కుమార్ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా ఎన్.టి.టి.పి.ఎస్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులను సంస్థలో విలీనం చేయాలని, 2022 పిఆర్‌సిలో కార్మికులకు ఇవ్వాల్సిన అరియర్స్ బకాయిలు చెల్లించాలని, గ్రాడ్యూటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. గత వారంలో పత్రికలలో విద్యుత్ సంస్థలలో నియామకాలు అనే శీర్షికపై కార్మికులలో ఉన్న భయాందోళనలను రూపుమాపుటానికి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పర్వతనేని సాంబశివరావు, రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కేతు మధుసూదన్ రెడ్డి, తెలుగునాడు విద్యుత్ కార్మిక సంఘం ఏపీ జెన్కో రాష్ట్ర అధ్యక్షులు ఆలపాటి శివనాగేశ్వరావు, పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య

పిఎసిఎస్ అధ్యక్షుడుగా సాంబశివరావు ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-వీరులపాడు

వీరులపాడు మండలంలోని అల్లూరి గ్రామంలో వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులుగా తిరుమల శెట్టి సాంబశివరావు శనివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి నందిగామ శాసనసభ్యులు తంగిరాల సౌమ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా వ్యవసాయ సహకార సంఘం అధికారులు తిరుమలేశెట్టి సాంబశివరావుతో ప్రమాణ స్వీకారం చేయించారు.

కెజిబివిలో ఫ్రెషర్స్ డే వేడుకలు

ప్రజాశక్తి - రెడ్డిగూడెం

రెడ్డిగూడెం మండల పరిధిలోని రంగాపురం కెజిబివిలో విద్యార్థుల ఆనందోత్సాహాల నడుమ ఫ్రెషర్స్‌డే వేడుకలు ఘనంగా నిర్వహించబడింది. ఇదే కార్యక్రమంలో ఈ నెలలో పదవీ విరమణ చేయనున్న ఎన్‌టిఆర్ జిల్లా సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్టు కో ఆర్డినేటర్ మహేశ్వరరావును సత్కరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరరావు, జిల్లా జిసిడిఓ బి.విశ్వభారతి, రెడ్డిగూడెం మండల విద్యాశాఖ అధికారి, రమేష్ పాల్గొని కేజీబీవీల ప్రాముఖ్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.శ్యామల పాల్గొన్నారు.



మొక్కనాటుతున్న కలెక్టర్ లక్ష్మీశ

జయంతి గ్రామంలో కలెక్టర్ పర్యటన

ప్రజాశక్తి-వీరులపాడు

స్వచ్ఛాంద.. స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని జయంతి గ్రామంలో శనివారం కలెక్టర్ లక్ష్మీశ పర్యటించారు. పలు అభివృద్ధి పనుల గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి మొక్కలు నాటారు. గ్రామంలో డ్రైనేజీలను పరిశీలించి మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామంలో తడి చెత్త, పొడి చెత్త సేకరిస్తున్న విధానం గురించి తెలుసుకున్నారు. ప్లాస్టిక్ మూలంగా అనేక మందికి ప్రమాదకరమైన వ్యాధులకు గురవుతున్నారని, ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సుభాషిని, జిల్లా పంచాయతీ అధికారి లావణ్య కుమారి, ఆర్‌డిఓ బాలకృష్ణ, తహాశీల్దార్ రవికుమార్, ఎండిఓ రామరాజు, కార్యదర్శి రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి : రైతు సంఘం వినతి

మండలంలోని పల్లంపల్లి కూడలి వైరా కట్టలేరు మీద నిర్మాణంలో ఉన్న బ్రిడ్జిని త్వరగా పూర్తి చేయాలని రైతు సంఘం నాయకులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోడు ఇచ్చేశ్వరరావు, వట్టి కొండ చంద్రమోహన్, శివాజీ, చాట్ల రవికుమార్, మాజీ సర్పంచ్ గువ్వల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఆంక్షల్లేకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయాలి

ప్రజాశక్తి-వత్సవాయి



డిప్యూటీ తహశీల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న సిపిఎం నేతలు

అంతర్రాష్ట్ర బస్సులకు ఉచిత బస్సు పథకం రాష్ట్ర సరిహద్దు వరకు వర్తింపజేయాలని సిపిఎం మండల కార్యదర్శి బి రాము డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన వత్సవాలు కార్యాలయంలో డిప్యూటీ తాశీల్దార్ ప్రభుకుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగ్గయ్యపేట నుండి వత్సవాయి రాష్ట్ర సరిహద్దు వరకు ఆంధ్ర బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలను టికెట్లు తీసుకోవాలని కండక్టర్లు చెప్పడంతో చేసేదిలేక టికెట్ తీసుకొని ప్రయాణం చేస్తున్నారని తెలిపారు. అధికారులు స్పందించి అంతర్రాష్ట్ర సరిహద్దు వరకు స్త్రీ శక్తి పథకం వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎన్.సి.హెచ్ సుప్రజా, బోతపల్లి బిక్షం, ఏసుపోగు వెంకటరత్నం, గంగుల వెంకయ్య, కూరపాటి వెంకటేష్, సుందర్ రావు, రత్నబాబు తదితరులు పాల్గొన్నారులి.

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో స్పందనకు బంగారు పతకం

ప్రజాశక్తి- నందిగామ



రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో గోనెల స్పందన బంగారు పతకం సాధించారు. ఈ సందర్భంగా స్పందనను నందిగామ డివిజనల్ కార్యాలయంలో నందిగామ డివిజనల్ అధికారి కె.బాలకృష్ణ, తహాశీల్దార్ సురేష్ బాబు శనివారం ఘనంగా సత్కరించారు. ఇంకా మరెన్నో విజయాలతో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్పందన తండ్రి గోనెల రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి : సిఐటియు

ప్రజాశక్తి- నందిగామ



వాహన మిత్ర ద్వారా ఆటో కార్మికుడికి రూ.25 వేలు ఆర్థిక సాయం చేయాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సి హెచ్ శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం నందిగామలో ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ ఎన్నికల ముందు టిడిపి నాయకులు ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు ఒక సాధికార సంస్థ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అధిక ఫెనాల్టీలు వేసేటువంటి జీవో 21 రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ప్రవేశపెట్టడంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిందని, సర్వీస్‌లేక ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ప్రభుత్వం ప్రతి ఆటో కార్మికుడికి సంవత్సరానికి రూ.25 వేల రూపాయలు చొప్పున ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనకి సన్నార్థం అవుతామని హెచ్చరించారు. సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె. గోపాల్,ఆటో కార్మిక యూనియన్ నాయకులు రవి, బాబు, ఖాసీం, వెంకటరత్నం, గోపి పాల్గొన్నారు.

గుంటుపల్లిలో 'స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర'

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం

గుంటుపల్లిలో శనివారం స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డిఓ చైతన్య పాల్గొని తడి చెత్త, పొడి చెత్త వేరు చేసే విధానాన్ని పరిశీలించారు. అలాగే ప్రతి ఇల్లు, ప్రతి వీధి పరిశుభ్రంగా ఉండేవిధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. తడి చెత్త, పొడి చెత్త వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు సహకరిస్తున్న పౌరులకు స్వచ్ఛంద సర్టిఫికెట్లు అందజేశారు. గ్రామంలో ప్రతి పౌరుడు స్వచ్ఛతపై శ్రద్ధ చూపాలని గ్రామస్తులకు తెలిపారు. అనంతరం గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎండిఓ మనోజ్, తహశీల్దార్ వై వెంకటేశ్వర్లు, గ్రామ సర్పంచ్ భూక్య కవిత, గ్రామ కార్యదర్శి మురళీ, పారిశుద్ధ్య సిబ్బంది పాల్గొన్నారు.

డిఎస్‌సి గణితంలో నాగరాజుకు మూడో ర్యాంకు

ప్రజాశక్తి-గంపలగూడెం



రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన డిఎస్‌పి ఫలితాల్లో గంపలగూడెం తూర్పు దళితవాడకు చెందిన కోట నాగరాజుకు ఉమ్మడి జిల్లా స్థాయిలో మూడవ ర్యాంకు సాధించారు. దీర్ఘకాలికంగా తన కఠోర శ్రమే నేటి ఈ ఫలితంగా పేర్కొన్నారు. ఎస్ఎ మ్యాథమెటిక్స్ సబ్జెక్టులో నాగరాజుకు ర్యాంకు రావడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

యూరియా అందుబాటులో ఉంచాలి రైతు, కౌలు రైతు సంఘం డిమాండ్

ప్రజాశక్తి- నందిగామ

యూరియా కొరత నివారించి రైతులకు సొసైటీల ద్వారా యూరియా అందించాలని కోరుతూ ఎపి కౌలు రైతు సంఘం, ఎపి రైతు సంఘం నేతలు శనివారం నందిగామ ఆర్డిఓ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి చనుమోలు సైదులు మాట్లాడుతూ.. జిల్లాలో యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, తక్షణమే ప్రభుత్వం సొసైటీల ద్వారా యూరియా సరఫరా చేసి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు యర్రా శ్రీనివాసరావు, కౌలు రైతుల సంఘం నాయకులు జి ఏడుకొండలు, పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని ధర్నా

ప్రజాశక్తి-జగ్గయ్యపేట



జగ్గయ్యపేట మండలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే విడుదల చేయాలని, జీవో 77 రద్దు చేయాలని, తల్లికి వందనం పెండింగ్ ఇవ్వాలని, అందరికీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఎస్.ప్రణయ్ తేజ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగ సమస్యల పరిష్కారం చేయడంలో ప్రభుత్వం విఫలం చెందిందని విమర్శించారు. గత మూడేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్ ఉండడం వలన విద్యార్థుల తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు కట్టవాల్సి వస్తుందని అన్నారు. సంక్షేమ హాస్టల్ లో విద్యార్థులకు మెస్, కాస్మొటిక్ చార్జీలు పెంచాలని, ఎన్నికల ముందు నారా లోకేష్ వంద రోజుల్లో జీవో నెంబర్ 77ను రద్దుచేసి పీజీ విద్యార్థులకు పూర్తి ఫీజు రియంబర్స్ మెంట్ ఇస్తామని చెప్పి హామీ ఇచ్చారని నేటి వరకు ఆ హామీ అమలు చేయకపోవడం దారుణమని అన్నారు ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సిహెచ్.వెంకటేశ్వరరావు, మండల కార్యదర్శి ఎస్.ప్రణయ్ తేజ, నాయకులు ఎస్.కె రీహన్, ఎస్.కె రెహమత్, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకాశం పంతులుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డలోని ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ కార్యాలయం వద్ద టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ పూలదండలు వేసి నివాళులర్పించారు. ఏఎంసీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు వైస్ ఛైర్మన్ రాజనాల వీరబాబు, దివిసీమ లలిత కళా సమితి ప్రధాన కార్యదర్శి కూనప రెడ్డి చంద్రశేఖర్, ఘంటసాల రాజమోహన్రావు, ఎలవర్తి చిన్న పాల్గొన్నారు. **ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా)** : విద్యలోనూ రాజకీయంలోనూ స్వాతంత్ర పోరాటంలోనూ తనదైన ముద్ర వేసుకొని ఎంతోమందికి బాట వేసిన టంగుటూరి ప్రకాశం పంతులును ఆదర్శంగా తీసుకోవాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధరరావు సూచించారు. శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా ఆంధ్ర కేసరి టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి జిల్లా ఎస్పీ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. .ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం** : బాపులపాడు మండలం మడిచర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో ఆంధ్ర కేశరి, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి, స్వాతంత్ర్య సమరయోధుడు టంగుటూరి ప్రకాశం పంతులు గారి 153వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వమించారు. ప్రధానోపాధ్యాయులు దోనె శ్రీహరి రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గుడ్లవల్లేరు** : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ టంగుటూరి ప్రకాశం పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది ,పంచాయతీ కార్యదర్శులు, ఎంఈఓ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి - గుడివాడ** : స్థానిక మున్సిపల్ కార్యాల యంలో టంగుటూరి ప్రకాశం పంతులు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ మనోహర్ టంగుటూరి పంతులు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్ళు అర్పించారు. మేనేజర్ నిర్మలకుమారి, అకౌంట్స్ ఆఫీసర్ జి.టి. నాయుడు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్** : ఆంధ్ర రాష్ట్రానికి టంగుటూరి ప్రకాశం పంతులు చేసిన సేవలు చిరస్మరణీయమని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, నందమూరు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు మద్ది బాబు రాజేంద్రప్రసాద్ అన్నారు. టంగుటూరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందమూరులో ఆయన జయంతిని నిర్వహించారు. నందమూరు పంచాయతీ కార్యదర్శి కే. జానకి లక్ష్మి, పాఠశాల సీనియర్ ఉపాధ్యాయులు కె. సత్యనారాయణ , పి. గణేష్, బి.టి. నాగేశ్వరరావు , వై. లక్ష్మణరావు పాల్గొన్నారు.


అవనిగడ్డలో...


గుడ్లవల్లేరులో...



ఆర్‌పిలపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి - గుడివాడ : ఆర్పీలకు నష్టం కలిగించే ప్రభుత్వ విధానాలను ఐక్యంగా తిప్పి కొట్టాలని ఆర్‌పిల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ధనలక్ష్మీ పిలుపునిచ్చారు. గుడివాడ పట్టణంలో స్థానిక సుందరయ్య భవనంలో ఏపీ మెప్మా ఆర్‌పి (పట్టణ రిసోర్స్ పర్సన్స్)ఉద్యోగుల సంఘం(సిఐటియు) అనుబంధం జిల్లా ప్రథమ మహాసభ ఎం దీవెన, జె.ఝాన్సీ అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ధనలక్ష్మి పాల్గొని మాట్లాడారు. అనంతరం మచిలీపట్నం, పెడన, గుడివాడ, ఉయ్యూరు, తాడిగడప, మున్సిపాలిటీ పరిధిలో పనిచేసే ఆర్పీల నూతన కమిటీని ఎన్ను కున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షు రాలుగా ఎం దీవెన, ప్రధాన కార్యదర్శిగా జె. ఝాన్సీ, కోశాధికారిగా కేపీ మాధవి, సహాయ కార్యదర్శిగా పి జ్యోతి, ఉపాధ్యక్షురాలుగా లక్ష్మీ కుమారిలను అలాగే 15 మందితో జిల్లా కమిటీ సభ్యుల్ని ఎన్నుకున్నారు. అనంతరం వేతనాలు పెంచాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలని, పని భారాన్ని తగ్గించాలని, ఆన్లైన్ యాప్‌లను శిక్షణ ఇవ్వాలని, తీర్మానాలను ఆమోదించారు.

ఈ కార్యక్రమంలో శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి ధనశ్రీ, కృష్ణాజిల్లా అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఏ రమాదేవి, సిఐటియు జిల్లా అధ్యక్షులు కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందిస్తున్న దృశ్యం

పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి-పమిడిముక్కల : విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను నేర్చుకొని ఉత్తమ ఫలితాలను సాధించాలని పామర్రు ఎమ్మెల్యే వరల కుమార్ రాజా అన్నారు. శనివారం మండలంలోని కపిలేశ్వరపురం ఉన్నత పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వం, దాతల సహకారంతో కపిలేశ్వరపురం గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు. గ్రామ సర్పంచ్ నాగమణి, సహకార బ్యాంక్ అధ్యక్షులు తాతినేని బాబురావు, టిడిపి నాయకులు తాతినేని రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వచ్ఛాంధ్ర.. స్వర్ణాంధ్ర ర్యాలీలు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన, గుడ్లవల్లేరులో స్వచ్ఛంద స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శని వారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో నిర్వహిస్తున్న వివిధ పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో మహమ్మద్ ఇమ్రాన్ పరిశీలించారు. గ్రామంలో అంటు వ్యాధులు వ్యాప్తి చెందకుండా ఉండేం దుకు ముందు జాగ్రత్తగా నిలువ ఉన్న మురికి నీటిని, పేరుకుపోయిన చెత్తను తొలగించడం, రక్షిత మంచినీటి ఓవర్ ట్యాంక్ వద్ద క్లోరియేషన్ చేయించడం , దోమల నివారణ కు ద్రావణాన్ని పిచికారి చేయించడం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఏ జె ఎల్ నరసింహారావు, పంచాయతీ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.అలాగే గుడ్లవల్లేరు శ్రీసాయి విద్యానికేతన్ పాఠశాలలో విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. **ప్రజాశక్తి-పామర్రు** : స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా పామర్రు గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం ఆధ్వర్యంలో స్థానిక పంచా యతీ కార్యాలయం వద్ద పచ్చదనం పరిశుభ్రత పైఅవగాహన కార్యక్రమం శనివారం జరిగింది. పామర్రు ఎంపీడీవో కే.జ్యోతి ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్తు కార్యాలయం వద్ద ఉద్యోగులచే ప్రమాణం కార్యక్రమం నిర్వహించి అనంతరం పామర్రు సెంటర్లో పచ్చదనం పరిశుభ్రత ఆవశ్యకతపై నినాదాలు చేస్తూ ప్రదర్శన నిర్వహించారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : పరిసరాల పరిశుభ్రత పాటించి స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర సాధనలో అందరూ భాగస్వాములు కావా లని ఎంపీడీవో జీఎస్వి శేషగిరిరావు అన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్య క్రమంలో భాగంగా శనివారం ఆకునూరులో పరిశుభ్రతపై అవగాహన ర్యాలీనిర్వహిం చి, ప్రతిజ్ఞ చేయించారు. వీధుల్లో చెత్తవేయకుండా పారిశుధ్య సిబ్బందికి అందజేయా లని, పరిస రాల్లో మురుగునీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఉమ్మడి కష్ణా జిల్లా గ్రామసర్పంచుల సంఘం అధ్యక్షులు గోలి వసంత కుమార్, ఏఎంసీ ఛైర్మన్ కొండా ప్రవీణ్ కుమార్, అసిస్టెంట్ ఎంపీడీవో కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు వెంకన్న, కాకాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొ న్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు** : మండలంలోని పెద్దఅవుటుపల్లి సెయింట్ జార్జ్ ఆర్ సి ఎం హై స్కూల్లో విద్యార్థులతో స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు ర్యాలీ చేస్తూ ప్లాస్టిక్ వాడకు ప్రాణాలు తీయకు అంటూ నినాదాలు చేశారు, స్వర్ణాంధ్ర స్వచ్ఛంద్ర అంటూ పెద్దఎత్తున నినాదాలు పలికారు. స్కూల్ ఉపాధ్యాయులు విజయ్, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్** : స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం లో భాగంగా శనివారం మచిలీపట్నం రైతు బజార్ నందు వ్యాపారస్తులకు సింగిల్ యూస్డ్ ప్లాస్టిక్ వస్తువుల వినియోగం, ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు నిషేధించుట గురించి వ్యాపారస్తులకు అవగాహన కల్పించారు. అలాగే స్వచ్ఛ ప్రతిజ్ఞ కూడా చేయించారు. రైతు బజార్ ఎస్టేట్ అధికారి లంకే బలి చక్రవర్తి, కార్పొరేటర్లు రాము, అనిత, సుధాకర్, మచిలీపట్నం నగర పాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఎం. గోపాలరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు** : పెనమలూరు మండలం చోడవరంలో స్వచ్ఛాంద్ర - స్వర్ణాంద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్ పాల్గొని మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు అందరూ మొక్కలు నాటాలని, వాటిని సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. **ప్రజాశక్తి-మోపిదేవి** : మోపిదేవి గ్రామంలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ కార్యక్రమాన్ని నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్, ఆలయ కార్యనిర్వాహణ అధికారి దాసరి శ్రీరామ వరప్రసాదరావు ఆలయ సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



ఉయ్యూరు మండలంలో...


ఉంగుటూరులో...


కంకిపాడులో...

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల మండలంలో గ్రామస్తులు, దాతల సహకారంతో అభివృద్ధి చెందుతున్న పెద్దగూడెం ఎంపీపీ స్కూల్ పలువురికి ఆదర్శవంతంగా నిలవాలని ఎన్నారై గొర్రెపాటి రంగనాథ బాబు అన్నారు. ఘంటసాల పెద్దగూడెంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణ దాతలైన ఎన్నారై రంగనాథ బాబు, కీ.శే. మాలెంపాటి సీతారామాంజనేయులు కుమార్తెలు అత్తలూరి రాజేశ్వరి కోటేశ్వరరావు దంపతులు, ఎన్నారై యనమదల మాధవిలు పాఠశాలను శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణాన్ని, సౌకర్యాలను పరిశీలించి, విద్యార్థులతో ముచ్చటించి, పాఠశాల నిర్వహణపై ఉపాధ్యా యులతో పాటు గ్రామస్తులను అభినందించారు. పాఠశాల ప్రాంగణంలో విద్యార్థుల కొరకు షెడ్డు నిర్మించాలని గ్రామస్తులు ఎన్నారై రంగనాథ బాబు దృష్టికి తీసుకెళ్లగా పాఠశాల భవన నామార్థులు కీ.శే.మాలెంపాటి సీతారామాంజనేయుల జ్ఞాపకార్థం గొర్రెపాటి విద్యాట్రస్టు తరుపున రూ.70 వేలు అందించేందుకు ముందుకు వచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి రామకష్ణ, పాఠశాల హెచ్ఎం సబ్బినేని శ్యామల, ఉపాధ్యాయుని అవనిగడ్డ భార్గవి. గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సురవరం సుధాకర్‌రెడ్డికి నివాళులు

ప్రజాశక్తి-మొవ్వ : సిపిఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, కమ్యూనిస్టు దిగ్గజం సురవరం సుధాకర్ రెడ్డి మృతికి మొవ్వ మండలం కూచిపూడి-పెదపూడి సెంటర్లోని కాంచన రావు సిపిఐ భవనంలో సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పామర్రు నియోజకవర్గ సిపిఐ సమితి కార్యదర్శి చెరుకు శ్రీనివాసరావు, నియోజకవర్గ సహాయ కార్యదర్శి కోసూరు వెంకట అప్పారావు, శాఖా కార్యదర్శులు పాల్గొన్నారు.

సురవరం లేని లోటు

తీర్చలేనిది : యార్లగడ్డ

ప్రజాశక్తి-గన్నవరం : అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం పోరాడిన కమ్యూనిస్టు యోధుడు సురవరం సుధాకర్ రెడ్డి లేని లోటు తీర్చలేనిదని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పేర్కొన్నారు. సుధాకర్ రెడ్డి మృతిపై తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేసిన ఆయన సుధాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ఒక ప్రకటనలో ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. తెలంగాణలోని మారుమూల గ్రామంలో పుట్టిన సుధాకరరెడ్డి విద్యార్థి నాయకుడిగా గుర్తింపు తెచ్చుకుని సమస్యల పరిష్కారం కోసం ఉద్యమాల్లో పాల్గొంటూ అంచలంచెలుగా ఎదిగి జాతీయస్థాయి రాజకీయాల్లో రాణించారని తెలిపారు. ప్రజా సమస్యల పట్ల ఉద్యమించిన సుధాకర్ రెడ్డి మూడుసార్లు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారని గుర్తు చేశారు.

అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవం

ప్రజాశక్తి-బంటుమిల్లి : బంటుమిల్లి మండలంలో మచిలీపట్నం ఎంపీ బాలసౌరి, పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్‌లు శనివారం పర్యటించి పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ముంజులూరు, సాతులూరు, నాగన్న చెరువు, మల్లంపూడి గ్రామాల్లో కోల్ ఇండియా వారి సౌజన్యంతో సిఎస్ఆర్ నిధులు 12. 63 లక్షలతో ఏర్పాటు చేస్తున్న ఎల్ డి మైక్రో ఫిల్టర్, నాగన్న చెరువు గ్రామంలో 15 లక్షల విలువ గల మైక్రో ఫిల్టర్‌ను ప్రారంభించారు. అలాగే మల్లంపూడి గ్రామంలో 35 లక్షల విలువగల 60 కేఎల్ ఓహెచ్ఎస్ఆర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈకార్యక్రమంలో కూటమి నాయకులు జడ్పిటిసి మలిశెట్టి వెంకటరమణ, ఇల్లూరి లీలా కృష్ణ, ముల్లపరు సర్పంచ్ బొడ్డు మంగమ్మ, మల్లంపూడి సర్పంచ్ రేవు శ్రీనివాసరావు, ఛైర్మన్ బొర్రా కాశి తదితరులు పాల్గొన్నారు


పనులకు ప్రారంభోత్సవం చేస్తున్న దృశ్యం

యూరియా కరువు !

'వ్యవసాయం గిట్టుబాటు కావాలి. పంటల దిగుబడులు పెంచాలి.' అని పాలకులు చెప్పే మాటలకు కార్యాచరణ కొరవడింది. పంటల పెరుగుదల, దిగుబడికి అవసరమైన మేర ఎరువులు సకాలంలో సరఫరా చేయడంలో ప్రభుత్వానికి కార్యాచరణ కొరవడింది. ఎరువుల కోసం రైతాంగం తీవ్ర అవస్తలు పడుతోంది. అధికార యంత్రాంగం సమస్య లేదని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో రైతులకు ఎరువులు దొరకని పరిస్థితి నెలకొంది. యూరియాను బ్లాక్‌లో కొనగోలు చేయాల్సిన పరిస్థితి ఈ సీజన్‌లో దాపురించిందని రైతాంగం వాపోతోంది.

ఈ ఖరీఫ్ సీజన్‌లో కృష్ణాలో 4,37,302 ఎకరాల్లో వివిధ రకాల పంటలు సాగవుతాయి. దీనికిగానూ యూరియా 38,300, డిఎపి 10,500, ఎంఒపి 3,920, మిశ్రమ ఎరువులు 28,500, సూపర్ ఫాస్పెట్ 7,300 మెట్రిక్ టన్నులు వినియోగిస్తారని అంఛనా. గత ఏడాది వరకు అవసరమైన ఎరువులను ప్రయివేటు వ్యాపారుల వద్ద సాధారణ ధరలకే రైతులు కొనుగోలు చేశారు. ఈ సీజన్ ప్రారంభం నుంచే అవసరమైన ఎరువుల కోసం అవస్థలు పడుతున్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల వద్ద యూరియా కోసం రైతులు బారులు తీరుతున్నారు. గంటల తరబడి వరుసలో నిలబడినా యూరియా అందడం లేదు. 10 ఎకరాలు వ్యవసాయం చేసే రైతు 45 కిలోల బ్యాగులు ఎకరాకు ఒకటి చొప్పున అడుగుతుంటే... అవసరమైన మొత్తంలో యూరియా లేదని చెబుతూ 2 నుంచి మూడు బ్యాగులు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారు. ఈ నేపథ్యంలోనే ఎరువుల కోసం రైతులు ఆందోళనలకు దిగుతున్నారు. ఈ నెల 11న ఉంగుటూరు తహశీల్దార్ కార్యాలయం వద్ద ఎరువుల

వీక్షణం

కొరతకు నిరసన తెలిపారు. అవసరమైన మొత్తంలో యూరియా ఇవ్వడం లేదని గన్నవరంలో బారులు తీరిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రెండు ప్రాంతాల్లోనే కాదు... జిల్లా అంతటా ఇదే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితుల్లో ఎరువుల కోసం రైతులు ప్రయివేటు వ్యాపారులను ఆశ్రయించకతప్పడం లేదు. అవసరాన్ని ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు రైతులను నిలువుదోపిడీ చేస్తున్నారు. సొసైటీల్లో రూ.265కు విక్రయిస్తున్న యూరియా బ్యాగ్‌ను రూ.90 వరకు పెంచి రూ.355కు బ్లాక్‌లో విక్రయిస్తున్నారు. మరికొన్ని ప్రాంతాల్లో యూరియా కోసం దుకాణాలకు వెళ్లిన రైతులకు ఖరీదైన కాంప్లెక్స్ ఎరువులను అంటగడుతున్నారు. దీంతో పంటల సాగుకు రైతుకు అదనపు భారం పడుతోంది.

జిల్లాలో అత్యధిక విస్తీర్ణం 4,16,262 ఎకరాల్లో వరి సాగవుతోంది. ఎరువుల వినియోగంలో భూసారం కీలకంగా ఉంటుంది. డెల్టా ప్రాంతంలోని సారవంతమైన నల్లరేగడి భూముల్లో పంటకు వ్యవసాయ శాఖ సిఫార్సు చేసిన మొత్తంలోనే ఎరువులు వినియోగిస్తారు. ఎకరాకు 50 కిలోల డిఎపి, మూడు దఫాలుగా 75 కిలోలు యూరియా, రెండు దఫాలుగా 20 కిలోలు పొటాష్ వినియోగిస్తారు. గన్నవరం, బాపులపాడు, ఉంగుటూరు తదితర మండలాల్లోని మెట్ట భూములు, పెడన, బంటుమిల్లి, కృత్తివెన్ను, నాగాయలంక, కోడూరు తదితర ప్రాంతాల్లోని ఇసుక, చౌడు భూములు, చెరకు, పసుపు, కంద, తమలపాకు, కూరగాయలు తదితర ఉద్యాన పంటలకు ఎక్కువ మొత్తంలో ఎరువులు వినియోగించాలి. అవసరమైన మేర యూరియా అందుబాటులో లేకపోవడంతో పంటల దిగుబడులు తగ్గి నష్టపోవాల్సి వస్తుందని రైతాంగం ఆందోళన చెందుతోంది. అవసరమైన ఎరువులను సకాలంలో అందించడానికి ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

-డి.రాంబాబు

విఐ యూజర్లకు ప్రత్యేక ఆఫర్లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

విఐ మూవీస్ అండ్ టివి సంస్థ విఐ యూజర్లందరికీ ప్రత్యేక ఆఫర్లు అందిస్తున్నట్లు విఐ మూవీస్ సంస్థ ఇంచార్జి కె.వర ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. తొలి ఎపిసోడ్‌ను, లైవ్ టీవీ, న్యూ స్ట్రీమింగ్ వీక్షణ కూడా ఉచితంగా అందిస్తున్నమని తెలిపారు. విఐ మూవీస్ అండ్ టీవీచౌక డేటా ప్లాన్లు, విస్తృతమైన కంటెంట్ దన్నుతో ఓటీటీ వినియోగం గణనీయంగా పెరిగిందని తెలిపారు. పరిశ్రమ అంచనాల ప్రకారం 2025లో భారత్‌లో 54.7 కోట్ల మంది ఓటీటీ యూజర్లు ఉండగా, 40 కోట్ల నుంచి 44.7 కోట్ల మంది వరకు కంటెంట్‌ను ఉచితంగా, యాడ్-ఆధారిత ప్లాట్‌ఫాంలపై వీక్షిస్తున్నారని తెలిపారు.

ఆవిష్కరణలకు కేంద్రంగా భారత్

- కెఎల్ వర్సిటీ విసి సారథి వర్మ

ప్రజాశక్తి -విజయవాడ సిటీ



విస్తృతమైన పరిజ్ఞానం, యువశక్తి, సాంకేతిక ప్రగతి కలిసిన భారతదేశం.. ప్రపంచ ఆవిష్కరణల కేంద్రంగా మారబోతోందని కెఎల్. యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జి.పి సారథి వర్మ అన్నారు. కెబిఎన్ కళాశాలలో కోడ్ స్పార్క్-2025 పేరుతో నిర్వహించిన 24 గంటల నిర్విరామ హ్యాకథాన్ శనివారం ముగిసింది. బహుమతి ప్రదానోత్స కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వర్మ మాట్లాడుతూ ఏ పరిశ్రమా రాత్రికి రాత్రి ఏర్పడదని, యువత ఆలోచనల్లో నుంచి పరిశ్రమలు ఆవిర్భవిస్తాయన్నారు. చిన్న చిన్న ఆలోచనలో భవిష్యత్తులో మహా పరిశ్రమలుగా రూపొందుతాయని తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో నిలబడటానికి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని యువతకు సూచించారు. ప్రిన్సిపల్ డాక్టర్ జి.కష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థుల నైపుణ్యం, జిజ్ఞాస, ఆవిష్కరణా శక్తి దేశానికి కొత్త పరిశ్రమల రూపంలో కచ్చితంగా మార్గదర్శకత్వం చేస్తాయన్నారు. కెబిఎన్ కళాశాల కమిటీ అధ్యక్షులు ఉసిరిక ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయికి చేరుకోవటానికి యువతరం ఆలోచనలకు పదునుపెట్టాలని సూచించారు. కంప్యూటర్స్ విభాగాధిపతి రవీంద్ర ప్రోగ్రాం నివేదిక సమర్పించారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

ప్రజాశక్తి-విజయవాడ

ఆర్థికంగా వెనకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులను ప్రోత్సహించే లక్ష్యంతో రాయల్ సర్వీస్ ట్రస్ట్ విజయవాడ ద్వారా 2025-26 విద్యా సంవత్సరానికిగాను మెరిట్ కం మీన్స్ స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయాలని పాలకమండలి నిర్ణయించిందని ట్రస్ట్ అధ్యక్షులు శీతాళం రాంబాబు, కార్యదర్శి తోట పద్మనాభరావు, కోశాధికారి అంకం రామసాయి ప్రసాద్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 60 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించిన ఇంటర్మీడియట్, డిగ్రీ, ఆపై కోర్సులను చదువుతున్న అర్హులైన విద్యార్థులు ట్రస్ట్ నిర్దేశించిన నమూనాలో తమ దరఖాస్తులను సెప్టెంబర్ 15వ తేదీలోగా స్వయంగా గానీ, పోస్ట్ ద్వారా గానీ అందజేయాలని తెలిపారు. దరఖాస్తు పంపిచాల్సిన చిరునామా రాయల్ సర్వీస్ ట్రస్ట్, ఎ4, సత్నం అపార్ట్‌మెంట్, గురుద్వార్ రోడ్డు, గురునానక్ నగర్, విజయవాడ-8. సెప్టెంబర్ 15వ తేదీ తరువాత చేరిన దరఖాస్తులు పరిశీలించబడవని తెలిపారు. ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థలలో చదివిన, చదువుతున్న విద్యార్థులకు ప్రాధాన్యత ఇవ్వబడుననని వెల్లడించారు. ఎంపికైన విద్యార్థులకు ముందుగా సమాచారం ఇవ్వబడుతుందని తెలిపారు. నమూనా దరఖాస్తు, ఇతర వివరాలకు పైన పేర్కొన్న రాయల్ సర్వీస్ ట్రస్ట్ అడ్రస్‌కు సంప్రదించవచ్చని తెలిపారు.

మానసిక ఆరోగ్యంపై వ్యాధుల ప్రభావం

- జీవశాస్త్రాల సదస్సులో వక్తలు

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్



మానవ ఆరోగ్యంపై సూక్ష్మజీవుల ప్రభావం గణనీయంగా ఉన్నందున పారిశుద్ధ్యం, నీరు విషయాల్లో మరింత జాగ్రత్త అవసరమని, వ్యర్థాల నిర్వహణ వ్యవస్థలు పటిష్టంగా ఉండాలని బాబా అణు పరిశోధన కేంద్రం డైరెక్టర్ ప్రొఫెసర్ వై.వి. నాంచారయ్య అన్నారు. విజయవాడ పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల జంతుశాస్త్రం, వక్షశాస్త్రం, జీవసాంకేతిక శాస్త్ర విభాగాల సంయుక్త నిర్వహణలో శనివారం జాతీయ సదస్సును వెబినార్ హాలులో డాక్టర్ నాంచారయ్య ప్రారంభిస్తూ భక్తులరద్దీ అధికంగా ఉండే ప్రయాగరాజ్‌లో అధునాతన మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయన్నారు. డాక్టర్ కె.నాగమోహన్ (బిట్స్ పిలానీ, హైదరాబాద్) మాట్లాడుతూ స్కిజోఫీనియా, క్యాన్సర్ తదితర వ్యాధుల వ్యాప్తి వెనక జన్యు కారణాలను అన్వేషించాల్సి ఉందని, వివిధ వ్యాధులు మానసిక ఆరోగ్యంపై దుష్ప్రభావం చూపుతున్నాయని, నూతన సాంకేతికత ద్వారా రోగనిర్ధారణ, రోగనివారణ పరంగా మెరుగైన ఫలితాలు సాధించే అవకాశం ఉందని తెలిపారు. సిసిఎంబి సైంటిస్ట్ డాక్టర్ బి.కిరణ్ కుమార్, సెంట్రల్ వర్సిటీ బయో కెమిస్ట్రీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఎస్.నరేష్, తిరుపతి ఐఐఎస్ఈఆర్‌కి చెందిన డాక్టర్ వి.శివకుమార్ తదితరులు నిర్దేశిత అంశాలపై ప్రసంగించారు. ఈ సదస్సు ఆదివారం ముగుస్తుంది.

కొత్త పార్కులు అభివృద్ధి చేయాలి: ధ్యానచంద్ర

ప్రజాశక్తి-విజయవాడ



నగరంలో కొత్త పార్కులను అభివద్ధి చెయ్యాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర ఉద్యానవన విభాగం అధికారులను ఆదేశించారు. ఎంజి రోడ్, బందావన్ కాలనీ, ప్రాంతాలను శనివారం సంబంధితఅధికారులతో కలిసి కమిషనర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ అన్ని విధాలుగా పార్కులను అభివృద్ధి చేయాలన్నారు. నగరంలో ఎల్‌బిఎస్ నగర్, ఎస్‌సి కాలనీ, వాంబే కాలనీ లోని బిజిఎఫ్ బ్లాక్ ల వద్ద కొత్త పార్కులను అభివద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించాలని కోరారు. కాలుష్యాన్ని తగ్గించే విధంగా పార్కులో మొక్కలు, గ్రీనరీని అభివృద్ధి చేయాలన్నారు. మొక్కలను లేని డివైడర్లలో మొక్కలు పెట్టాలని, కాలుష్యం తగ్గించే విధంగా రోడ్లకి ఇరువైపులా మొక్కలను నాటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

మహిళలకు అమెజాన్ స్కాలర్‌షిప్‌లు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్

అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ ప్రారంభించినట్లు స్కాలర్‌షిప్ ఇంచార్జి కె.దేవానంద్ ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2029 విద్యా సంవత్సరాల కోసం 500 కొత్త స్కాలర్‌షిప్‌లను ప్రకటించినట్లు తెలిపారు. అల్పాదాయ నేపథ్యం నుండి వచ్చిన మహిళా ఇంజనీరింగ్ విద్యార్థులకు ఈ ప్రోగ్రామ్ ఉపయోగపడుతుందని అన్నారు. విద్య, కెరీర్ అభివద్ధిలో సమాన అవకాశాలను అందిస్తుందని వెల్లడించారు. మొదటి 200 మంది గ్రాడ్యుయేట్లలో 80 శాతం కంటే ఎక్కువ మంది ప్రముఖ ఫార్చ్యూన్ 500 కంపెనీలలో ఉద్యోగాలను పొందారన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి -విజయవాడ సిటీ

సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి ఎన్‌టిఆర్ జిల్లా బిసి హెచ్ఎస్ డాక్టర్ మాధవి తెలిపారు. కొత్తపేటలో షేక్ రాజా సాహెబ్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు శనివారం ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వర్షాకాలంలో పరిసరాల పరిశుభ్రత పాటించి తగు ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వర్షా కాలంలో వ్యాప్తి చెందే వైరల్ ఫీవర్, డెంగ్యూ, మలేరియా జ్వరాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

వినోదాత్మక చిత్రం సుందరకాండ

- నగరంలో చిత్ర బృందం సందడి

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్



సుందరకాండ చిత్రం ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుందనీ, పూర్తి వినోదాత్మకంగా రూపొందించబడిన చిత్రమని ప్రముఖ హీరో నారా రోహిత్ తెలిపారు. సమాజంలోని ప్రతి వ్యక్తికి సాధారణ జీవితంలో ఎదురయ్యే సన్నివేశాలతో ఆద్యాంతం ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు. ఈ నెల 27న వినాయక చవితి పండుగ చేసుకొని సుందరకాండ చిత్రాన్ని వీక్షించాలనీ కోరారు: నగరంలో సుందరకాండ చిత్ర బందం సందడి చేసింది. సుందరకాండ చిత్ర ప్రమోషన్‌లో భాగంగా హీరో నారా రోహిత్, హీరోయిన్ శ్రీదేవి, మరో హీరోయిన్ వృతి వాగాని విజయవాడకు వచ్చారు. ఓ హెటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో నారా రోహిత్ మాట్లాడుతూ... సుందరకాండ చిత్రం సమాజంలోని ప్రతి వ్యక్తికి సాధారణ జీవితంలో ఎదురయ్యే సన్నివేశాలతో ఆద్యాంతం ప్రేక్షకుల్ని అలరిస్తుందన్నారు. హీరోయిన్స్ శ్రీదేవి, వతి వాగానిలు మాట్లాడుతూ... ఈ చిత్రంలో నటించడం చాలా సంతోషంగా ఉందన్నారు. సుందరకాండ చిత్రంలో అవకాశం రావడం తమ అదృష్టం అన్నారు. సమావేశంలో నిర్మాత సంతోష్ పాల్గొన్నారు